

కామాంధుడి కథ ముగిసింది



నారాయణరావు మృతదేహం

- తునిలో బాలికపై అత్యాచారం చేసిన నిందితుడి మృతి
- పోలీసుల నుంచి తప్పించుకుని చెరువులో దూకిన నిందితుడు
- న్యాయాధికారి వద్దకు తరలిస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఘటన
- రాత్రి చెరువులో పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలించినా దొరకని ఆచూకీ
- గురువారం ఉదయం చెరువు మధ్యలో వలకు చిక్కిన మృతదేహం

(కాకినాడ/తునిరూరల్, ఆంధ్రజ్యోతి)

బాలికను చెరచిన కామాంధుడి కథ ముగిసింది.. తాతయ్యనంటూ బాలికపై పలుసార్లు అత్యాచారం చేసి అరెస్టయిన నిందితుడి కథ కంచికి చేరింది. చేసిన పాపానికి కటకటాల్లో శిక్ష అనుభవించాలన్న భయమో.. లేదంటే సభ్య సమాజానికి తన నిజరూపం బయట తెలిసిపోయిందన్న అవమానమో చివరకు నిందితుడు నారాయణరావు పోలీసులనుంచి తప్పించుకుని ప్రాణాలు కోల్పోయాడు. చెరువులోకి దూకి పాపం పండించుకున్నాడు. చివరికి ఈ కామాంధుడి మరణం సొంత రక్తసంబధీకులను సైతం కంటతడి పెట్టించలేదు. కనిపెంచిన తండ్రి పాపాలపుట్ట బద్ధలై పైకి పోవడమే మంచిదయిందంటూ ఆగ్రహంగా పేర్కొనడం నిందితుడిపట్ల కుటుంబంలోను ఏస్థాయిలో ఏవగింపు కలిగించిందో చాటుతోంది. బాలికను చెరచిన ఇలాంటి వ్యక్తి చనిపోవడమే మంచిదంటూ ఆగ్రహం వ్యక్తం చేసేలా వారంతా వ్యాఖ్యానించడం నారాయణరావు చేసిన తప్పు ఎలాంటిదనేది చాటుతోంది. సదరు నిందితుడి మృతదేహాన్ని తీసుకోవడానికి కుటుంబీకులు సైతం ముందుకురాకపోవడం విశేషం. తొండంగి తోటలో బాలికను అత్యాచారం చేసిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టుచేయడంతోపాటు పలు తప్పుడు పోస్టులు షేర్ చేయడంపై వైసీపీ మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అనుచరుడు గణేశుల వీరబాబును పోలీసులు అరెస్ట్ చేశారు.

(మిగతా 7వ పేజీలో)

వానే..వాన!



- అల్పపీడనంతో జిల్లాలో వర్షాలు
- నేడు వాయుగుండంగా మారొచ్చు
- అత్యధికంగా బిక్కవోలులో 57.2.. అత్యల్పంగా గోకవరం 3.8. మి.మీ..వర్షపాతం
- మరో మూడురోజులు వర్షాలే
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం.. విద్యుత్‌శాఖ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు

వానే వాన.. జిల్లాలో గురువారం వర్షం జోరున కురిసింది. ఈ ధాటికి రహదారులు జలమయమయ్యాయి. కాగా, మరో రెండు, మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది.

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో గురువారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నగరంలో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షం పడుతూ ఉంది. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్డుపైకి వర్షపునీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రైల్వేస్టేషన్ రోడ్డులో వర్షపునీరు వీధులల్లోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లివచ్చేటప్పుడు తడుస్తూ ఇబ్బందులు పడ్డారు. చిరువ్యాపారాలు చేసుకునేవారు, కూలీలదీ అదే పరిస్థితి.

జిల్లాలో 348.2 మి.మీ. వర్షపాతం

అల్పపీడనప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా గురువారం 348.2 మి.మీ. వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. జిల్లాలో అత్యధికంగా బిక్కవోలులో 57.2 మి.మీ. వర్షం కురిసింది. జిల్లాలో 19 మండలాల్లో 18.3శాతం వర్షం కురిసింది. అనపర్తిలో 34.6 మి.మీ., రాజమహేంద్రవరం రూరల్‌లో 26.6, రాజమహేంద్రవరంలో 24.8, రాజానగరంలో 20.4, నల్లజర్లలో 20.0, గోపాలపురంలో 19.2, రంగంపేటలో 18.8, తాళ్లపూడిలో 18.8, పెరవలిలో 17.4, కోరుకొండలో 16.4, ఉండ్రాజవరంలో 15.4, చాగల్లులో 13.4, కడియంలో 10.4, సీతానగరంలో 10.2, నిడదవోలులో 8.6, కొవ్వూరులో 6.4, దేవరపల్లిలో 5.8, గోకవరంలో 3.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

నాలుగైదురోజులపాటు

అల్పపీడనం శుక్రవారం మధ్యాహ్నం నాటికి బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఆ తర్వాత అది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ రాగల 24 గంటల్లో బలపడే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో జిల్లాలో మరో నాలుగైదు రోజులపాటు భారీవర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉంటుందని అమరావతి వాతావరణశాఖ వెల్లడించింది. తీరప్రాంతం అల్ల కల్లోలంగా మారింది. మధ్యాహ్నంనుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. గంటకు గరిష్ఠంగా 50కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండడంతో తీరప్రాంతాల్లో అలజడి నెలకొంది. ఈ నెల 25 వరకు కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాల్లోని అనేకచోట్ల ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు పడనున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారడంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసి వారిని అప్రమత్తం చేశారు.

సర్కిల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

- ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వాతావరణశాఖ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాజమహేంద్రవరంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ ఆదేశాల మేరకు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రాజమహేంద్రవరంలోని జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో 7382299960, 0883-2463354 నెంబర్లు, రాజమహేంద్రవరం టౌన్ కార్యాలయంలో 9490610093, రూరల్ డివిజన్‌లో 9593178874, నిడదవోలు డివిజన్‌లో 8332973595 నెంబర్లతో 24 గంటలపాటు మూడు షిఫ్టుల్లో పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. భారీవర్షం, వరదల వల్ల ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడితే దగ్గరలోని విద్యుత్ సెక్షన్ ఆఫీసుకుగానీ, టోల్‌ఫ్రీ నెంబరు 1912 కుగానీ, కంట్రోల్ రూమ్ నెంబర్లకుగానీ సమాచారం అందించాలని ఎస్ఈ కోరారు.

పారిశ్రామికవాడల్లో పచ్చదనం -పరిశుభ్రత

- ధవళేశ్వరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో మొక్కలు నాటిన కలెక్టర్ కీర్తి

రాజమహేంద్రవరంరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ధవళేశ్వరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో గురువారం పచ్చదనం -పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. దీనికి కలెక్టర్ కీర్తి చేకూరి ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. విశాఖలో ఈనెల 14,15 తేదీల్లో జరిగిన పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో భాగంగా ఈనెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మొదటివారంలో పరిశుభ్రత, రెండోవారంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. దీనికి కొనసాగింపుగా నిర్వహించిన పచ్చదనం -పరిశుభ్రతలో కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడారు. పారిశ్రామికవేత్తలు తమ యూనిట్ల పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రతతో ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు ఆరోగ్యంగా, ఉత్సాహంగా పనిచేయగలరని అన్నారు. ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ మాట్లాడుతూ పారిశ్రామికవాడల్లో ఉన్న యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతూ పర్యావరణానికి అనుకూలంగా వ్యవహరించాలన్నారు. పరిశ్రమలు పచ్చదనం-పరిశుభ్రతను సమన్వయంగా కొనసాగిస్తే వాటి అభివృద్ధి సుస్థిరంగా ఉండడమే కాకుండా స్థానిక ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయన్నారు. కడియం ప్రాంతంలో ఉన్న చిన్నచిన్న నర్సరీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, పర్యాటకఅభివృద్ధి దృష్ట్యా కడియపులంక-పొట్టిలంక మధ్యలో స్టాల్స్ ఏర్పాటు చేయాలనే గత కలెక్టర్ నిర్ణయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ధవళేశ్వరం ఇండస్ట్రియల్ ఎస్టేట్ కమిటీ అధ్యక్షుడు మార్ని వాసుదేవ్, జీఎం ఎ.రమణారెడ్డి, డిప్యూటీ జోనల్ మేనేజరు బి.రాధమణి, జీఎం డీఐసీ రామమ్, వ్యవసాయ అధికారి మాధవరావు, పారిశ్రామికవేత్తలు శ్యామ్‌సుందర్, భాస్కరరావు, ప్రభాకర్, సూర్యప్రకాష్, శ్రీహరి పాల్గొన్నారు.



ఇంటి నుంచే పని.. చేసేయొచ్చు!

నిరుద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోం కింద ఉద్యోగాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నిరుద్యోగుల ఆశలను చిగురింపచేస్తూ వర్క్‌ఫ్రమ్ హోం కౌశలం సర్వేలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు త్వరలోనే ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఐటీ కంపెనీలు ఒక్కొక్కటిగా రాష్ట్రానికి తరలివస్తున్నాయి. ఈ తరుణంలో ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న వేలాదిమంది నిరుద్యోగులు చిరుద్యోగిగానైనా ఆయా మల్టీ నేషనల్ కంపెనీల్లో అవకాశం కల్పిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

- నిరుద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోంకు ఏర్పాట్లు
- త్వరలోనే ఆన్‌లైన్ పరీక్షలకు సన్నాహం
- సచివాలయాలకు వెబ్ కెమెరాలు, హెడ్‌సెట్‌లు పంపిణీ

అమలాపురం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా వేలసంఖ్యలో అభ్యర్థులు కౌశలం సర్వేలో దరఖాస్తు చేసుకున్నారు. నిరుద్యోగులకు సచివాలయాల వారీగా పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి పరీక్షల నిర్వహణలో భాగంగా సచివాలయాలకు వెబ్ కెమెరాలు, హెడ్‌సెట్‌లను పంపిణీ చేశారు. త్వరలోనే పరీక్షల నిర్వహణకు సంబంధించిన సమాచారం విడుదలయ్యే అవకాశం ఉంది. వర్క్‌ఫ్రమ్ హోం కింద కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ఏర్పాట్లు చేస్తుండడం పట్ల వారంతా ఆశగా ఎదురు చూస్తున్నారు.

రెండు విడతలుగా సర్వే

వర్క్‌ఫ్రమ్ హోం సర్వేలో భాగంగా తొలి విడత గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఇంటింటా సర్వే నిర్వహించారు. విద్యార్హతలను బట్టి వర్క్ ఫ్రమ్ హోం కింద ఏ తరహా ఉద్యోగాలు చేయాలనుకుంటున్నారో నమోదు చేశారు. పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్‌తోపాటు వివిధ విద్యార్హతలు ఉన్న అభ్యర్థుల సమాచారాన్ని సమగ్రంగా తొలివిడతలో సేకరించారు. తొలి విడతలో నిర్వహించిన వర్క్‌ఫ్రమ్ హోం సర్వే కింద ఉద్యోగాలు చేసేందుకు జిల్లాలో కొందరు నిరుద్యోగులు ఆమోదం తెలిపారు. వారి సమగ్ర సమాచారాన్ని ఈ ఏడాది ఆగస్టు నెలలో రెండోదశలో సేకరించారు. ఎవరెవరు ఏం చదువుకున్నారో తెలుసుకుని వారి సర్టిఫికెట్లను సైతం ఆన్‌లైన్ చేశారు. నిరుద్యోగ అభ్యర్థులకు తెలిసిన భాషలు ఎన్ని, విద్యార్హతలు, ఏమైనా స్పెషలైజేషన్ కోర్సు పూర్తి చేశారా, వచ్చిన మార్కులు, ఏ ఏడాదిలో ఉత్తీర్ణులయ్యారో తెలుసుకుని వివరాలు అన్నింటినీ సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ చేశారు.

సచివాలయశాఖ ఆధ్వర్యంలో పరీక్షలు

కౌశలం సర్వేలో వర్క్‌ఫ్రమ్ హోం కింద దరఖాస్తు చేసుకున్న వారికి జిల్లా గ్రామ, వార్డు సచివాలయశాఖ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే పరీక్షల నిర్వహణ వివరాలను వెల్లడించే అవకాశం ఉంది. ప్రభుత్వం పలు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని వారి సహకారంతో ఈ పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ఐటీ సెక్టార్‌పై దృష్టి సారించినట్టు తెలిసింది. ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు వర్క్‌ఫ్రమ్‌హోం కింద ఉద్యోగావకాశాలు మెండుగా కల్పించే అవకాశం ఉందంటున్నారు. దీనిలోభాగంగానే ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్నవారి ఇళ్ల వద్ద బ్రాడ్‌బ్యాండ్ కనెక్టవిటీ ఉందా, దాని స్పీడ్ వివరాలు, వర్క్‌ఫ్రమ్ హోం ఉద్యోగం చేసుకోవడానికి ఇంట్లో ప్రత్యేక గది ఉందా, అదే గదిలో మరికొందరు పనిచేసుకునే అవకాశం ఉదా అన్న వివరాలను సైతం ఇప్పటికే సేకరించారు.

ఏ జిల్లాలో ఎందరు..

తొలి, రెండో దశల్లో మొత్తం సర్వే చేసిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 4,23,533 గృహాల్లో 9,34,989మంది చదువుకున్నవారు ఉన్నారు. వీరిలో 920791 మందిని సర్వేచేయగా 1,93,564మంది ఉద్యోగాల్లో ఉన్నారు. వీరిలో 14,865మంది వర్క్‌ఫ్రం హోంలో పనిచేస్తున్నట్టుగా గుర్తించారు.
- కాకినాడ జిల్లాలో 5,35,791 గృహాల్లో 11,79,587మంది చదువుకున్నవారు ఉన్నారు. వీరిలో 11,58,593మందిని సర్వే చేయగా 2,15,845మంది ఉద్యోగాల్లో ఉన్నారు. వీరిలో 19,628మంది వర్క్‌ఫ్రం హోంలో పనిచేస్తున్నట్టుగా గుర్తించారు.
- తూర్పుగోదావరి జిల్లాలో గృహాల్లో 463680మంది చదువుకున్నవారు ఉన్నారు. వీరిలో 10,19,051మందిని సర్వే చేయగా 10,01,395మంది ఉద్యోగాల్లో ఉన్నారు. వీరిలో 18,844మంది వర్క్‌ఫ్రం హోంలో పనిచేస్తున్నట్టుగా గుర్తించారు.

వైసీపీలోనే కల్తీ మద్యానికి మూలాలు

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కల్తీమద్యం మూలాలు వైసీపీలోనే ఉన్నాయని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా వైసీపీ ఉందని ధ్వజమెత్తారు. ఐదేళ్లపాటు అరాచకపాలన చేసిన వైసీపీ రాష్ట్రంలో కల్తీమద్యాన్ని పెంచి పోషించిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కల్తీ మద్యంపై ఉక్కుపాదం మోపడంతో వాస్తవాలు బయటకు వచ్చి వైసీపీనేత జోగిరమేష్ అడ్డంగా దొరికిపోయాడన్నారు. జగన్ జమానాలో నాసిరకం మద్యం అమ్మకాలతో రాష్ట్రంలో ఎంతమందికి లివర్లు దెబ్బతిన్నాయో ఆసుపత్రి రికార్డులను పరిశీలిస్తే అర్థమవుతుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక కల్తీ మద్యం వ్యవహారంపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ వేయడంతో వైసీపీ గుండెల్లో దడ మొదలైందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జనసేనసిటీ ఇన్చార్జి అనుశ్రీ సత్యనారాయణ, నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్, అడబాల రామకృష్ణారావు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ బకాయిలకు వైసీపీ విధానాలే కారణం: ఎమ్మెల్యే నల్లమిల్లి



రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకపోవడానికి వైసీపీ ప్రభుత్వ విధానాలే కారణమని అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ బకాయిలేకాదు రైతుల బకాయిలు, కాంట్రాక్టర్ల బకాయిలకు కూడా వైసీపీ ప్రభుత్వమే కారణమని విమర్శించారు. సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిసి మాట్లాడతారో తెలియక మాట్లాడతారో అర్థం కాదన్నారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు అనపర్తిలో హాల్టు ఇవ్వడంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందన్నారు. ఎంపీ పురందేశ్వరి కృషితో ఇది సాధ్యమైందని, ఆమెకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాయవరం బాణసంచా పేలుడు ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.15లక్షల చొప్పున పరిహారం ప్రకటించిందన్నారు. కార్మికశాఖ మంత్రి సుభాష్ సమక్షంలో శుక్రవారం పరిహారం అందజేస్తామని ఆయన వెల్లడించారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి పూర్వవైభవం

- జనవరి నాటికి పూర్తిస్థాయి కార్యకలాపాలు
- త్వరలో రిజిస్ట్రార్, ఇతర ప్రధాన విభాగాల అధికారుల నియామకం
- తొలి వీసీగా బాధ్యతలు స్వీకరించిన మునిరత్నంనాయుడు



వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న మునిరత్నంనాయుడు.. చిత్రంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి


రాజమహేంద్రవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): 'తెలుగు విశ్వవిద్యాలయానికి పూర్వవైభవం తెస్తాం. ఎన్టీఆర్ ఆశయానికి పునరంకితమవుతాం. జనవరినాటికి పూర్తిస్థాయి విశ్వవిద్యాలయ కార్యకలాపాలు ప్రారంభిస్తాం' అని వైస్ చాన్సలర్ ఆచార్య డి.మునిరత్నంనాయుడు స్పష్టం చేశారు. స్థానిక బొమ్మూరులోని తెలుగు విశ్వవిద్యాలయంలో గురువారం ఆయన తొలి వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి తెలుగు విశ్వవిద్యాలయంలో పలు పదవులు నిర్వహించి, నెల్లూరు కేంద్రంగా ఉన్న ప్రాచీన తెలుగు భాషా అధ్యయన కేంద్రం మాజీ ప్రాజెక్టు డైరెక్టర్ మునిరత్నం నాయుడికి అనుభవం ఉంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా కొత్తకోర్సులు ప్రవేశపెట్టనున్నట్టు చెప్పారు.ఈ విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ మానసపుత్రిక అనీ, ఆయన కలల్లో తెలుగు తల్లి గౌరవాన్ని పెంచే ఆవిష్కరణ ఒకటని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సమానాభివృద్ధి దృష్ట్యా రాజమహేంద్రవరం, శ్రీశైలం, వరంగల్ హైదరాబాద్‌లలో విభిన్న పీఠాలు ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన వివరించారు. అప్పటి మొదటి ఉపకులపతి ఆచార్య దోణప్ప శయంతి ఉత్సవాలను ఈ ఏడాది నిర్వహించనున్నట్టు తెలిపారు. నవోదయ పాఠశాలలు, సీబీఎస్ఈ పాఠశాలలో మూడో భాషగా తెలుగు బోధన ప్రవేశపెట్టనున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ఎన్టీఆర్ స్వయంగా వచ్చి ఇక్కడ తెలుగుపీఠం ప్రారంభించారని, మాతృభాషలో విద్యా బోధన చేయాలనే ధృడ సంకల్పమే ఆయన ఆశయమన్నారు. త్వరలో లైబ్రరీ అభివృద్ధి, ప్రాంగణంలో మౌలిక సదుపాయాల కల్పన, రహదారి అనుసంధానం, భవన మరమ్మతులు, పెయింటింగ్, వంటి పనులకు చర్యలు చేపడతామని వివరించారు. కార్యక్రమంలో శ్రీశైలం ప్రాంగణం పీఠాధిపతి ముసుగు శ్రీనివాసరావు, పారిస్ తెలుగు పరిశోధకుడు డేనియల్ నెజర్స్, ఓఎస్డీ వి.నిరీక్షణబాబు, కవి బిక్కి కృష్ణ, కూడిపూడి గురువు దుర్గాప్రసాద్, కూచిపూడి ప్రిన్సిపాల్ ఇంతా రవి బాలకృష్ణ, మురళి రత్నాల పాల్గొన్నారు.



సువర్ణోదయం..!

తెలతెలవారుతుండగా ఆకాశం సువర్ణమయంగా మారి కనువిందు చేసింది. మేలిమి ఛాయలో ఆకాశం మధ్యమధ్యలో నల్లని మబ్బులతో ఈ ఈ అద్భుత దృశ్యాన్ని చూసిన వారు ఆశ్చర్యానికి గురయ్యారు. అల్లూరి సీతా రామరాజు జిల్లా ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో గురువారం ఈ దృశ్యం 'ఆంధ్రజ్యోతి' కంటపడింది.

- ఎటపాక (ఆంధ్రజ్యోతి)



మేఘాల పరదా!

మేఘాల పరదా పంటపొలాలపై దుప్పటిలా పరచుకున్నట్టుంది కదూ..! దట్టంగా అలముకున్న నల్లని మేఘా లు ఆకాశం నుంచి వరిచేనుపైకి దిగుతున్నట్టున్నాయి.. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పంట పొలాల మీదుగా గురువారం కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.


- గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి)

క్లాస్ రూం టు అసెంబ్లీ

మాక్ అసెంబ్లీ నిర్వహణ ద్వారా శాసనసభలో అడుగుపెట్టే అరుదైన అవకాశాన్ని విద్యార్థులకు కూటమి ప్రభుత్వం కల్పిస్తోంది. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహిస్తోంది. సర్కారు అందిస్తున్న ఈ లక్కీ చాన్స్‌ను వినియోగించుకునేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు.



- అసలు వదల'మాక్'ండి
- అసెంబ్లీ సమావేశాలు ప్రత్యక్షంగా చూసేందుకు విద్యార్థులకు అరుదైన అవకాశం
- పాఠశాల, మండల, నియోజకవర్గ స్థాయిల్లో పోటీల నిర్వహణ





తుని మండలం తేటగుంట జడ్పీ హైస్కూల్లో వక్తృత్వ పోటీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

చట్టసభలంటేనే మన తలరాతను మార్చే గొప్ప ప్రదేశం. అదే అసెంబ్లీ.. అక్కడ జరిగే చర్చలు, తీర్మానాలు.. చట్టాలు చేయడం వంటివి ప్రత్యక్షంగా అక్కడే ఉండి చూడాలని చాలామందికి ఉంటుంది. స్పీకర్ అధ్యక్షతన జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఏయే అంశాలపై చర్చిస్తున్నారు? ఏ విషయాలకు సభ్యులు ఆమోదం తెలుపుతున్నారు?.. అధికార ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలు.. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలపడం.. వాకౌట్లు, ఒకరిపై ఒకరు విమర్శ లు? వంటి ఎన్నో ఆసక్తికర సంఘటనలకు ఈ సమావేశాలు వేదికగా నిలుస్తాయి. మరీ ముఖ్యంగా మన నియోజకవర్గ ఎమ్మెల్యేలు ఏం మాట్లాడుతున్నారా? స్థానిక సమస్యలపై గళం వినిపించారా లేదా? ఇలాంటి అనేక విషయాలను ఆసక్తిగా గమనిస్తాం. ఒకప్పుడు అసెంబ్లీ సమావేశాల ప్రత్యక్ష ప్రసారాలను ఎంతో ఇష్టంగా చూస్తూ చాలా మంది సీనియర్ సిటిజన్లు టీవీలకు అతుక్కుపోయేవారు. ఇప్పుడు అరచేతిలోకి అంతర్జాలం అందుబాటులోకి వచ్చేయడంతో సెల్ ఫోన్లలోనే సమావేశాల తీరును గమనిస్తున్నారు.

అయితే రాష్ట్ర పాలనలో కీలకమైన అసెంబ్లీలోకి అడుగుపెట్టే అరుదైన అవకాశాన్ని విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కల్పిస్తోంది. నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీలో పాల్గొనే అవకాశం విద్యార్థులకు కల్పించేలా ఏర్పాట్లు చేస్తోంది.

ఎవరు అర్హులంటే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1582, కాకినాడ జిల్లాలో 1017, తూర్పు గోదావరి జిల్లాలో 982 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 3.25లక్షల మంది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 8, 9, 10 తరగతులు చదివే వారు సుమారు లక్ష వరకు ఉంటారు. వీరిలో ఆసక్తి, ఉత్సాహవంతులైన విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఇప్పటికే మంగళ, బుధవారాల్లో పాఠశాల స్థాయిలో ఈ పరీక్షలు జరిగాయి. ఈ నెల 24, 25 తేదీల్లో మండల స్థాయిలో ఆయా స్కూళ్ల పరిధిలో జరగనున్నాయి. వీటిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే పోటీలకు పంపుతారు. అక్కడ ఎంపికైన అభ్యర్థులను శిక్షణకు పంపిస్తారు.

ముందుగానే శిక్షణ

ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచేవారికి మాక్ అసెంబ్లీలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. కాకినాడ జిల్లాలోని కాకినాడ సిటీ, రూరల్, పెద్దాపురం, జగ్గంపేట, పిఠాపురం, ప్రత్తిపాడు, తుని... ఏడు నియోజకవర్గాల నుంచి ఎంపికైన వారికి అమరావతిలో ముందుగానే శిక్షణ ఇస్తారు. అసెంబ్లీలో మాదిరిగానే సీఎం, డిప్యూటీ సీఎం, స్పీకర్, ఎమ్మెల్యేలుగా విద్యార్థులే వ్యవహరిస్తారు. మాక్ అసెంబ్లీ సాక్షిగా విద్యార్థులు తమలోని ప్రతిభను చాటుకునే అవకాశం దక్కనుంది. ఈ మొత్తం పోటీలను పర్యవేక్షించే బాధ్యతను పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయులకు, మండలస్థాయిలో ఎంఈవోలు, డీవైఈవోలకు. నియోజకవర్గ స్థాయిలో డీఈవో, డీవైఈవోలకు అప్పగించారు.

ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించేందుకు పోటీలు నిర్వహిస్తున్నారు. వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు పాఠశాల,మండల, నియోజకవర్గ స్థాయిల్లో నిర్వహించనున్నారు. వీటిలో ఎంపికైన వారికి అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు.

ఏయే టాపిక్‌లు అంటే..

స్కూలు స్థాయిలో 'లోకల్ సెల్ఫ్ గవర్నెన్స్'పై వ్యాసరచన, 'మై ఫేవరెట్ ఫ్రీడం ఫైటర్' అంశంపై వక్తృత్వం, మండల స్థాయిలో 'సివిల్ రైట్స్ అండ్ సిటిజన్ రెస్పాన్సిబులిటీ' అంశంపై వ్యాసరచన, 'మేకింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ యాక్ట్స్ ఫర్ హ్యూమన్' అంశంపై వక్తృత్వం, 'ద ఇండియన్ ఫ్రీడం ఫైట్' అంశంపై క్విజ్ పోటీలు జరుగుతాయి. నియోజకవర్గ స్థాయిలో 'హిస్టరీ బిహైండ్ మేకింగ్ ఆఫ్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ (రాజ్యాంగ రూపకల్పన వెనుక చరిత్ర) అంశంపై వ్యాసరచన, 'మేకింగ్ ఇండియా ద్వారా వికసిత్ ఆంధ్రప్రదేశ్' అంశంపై వక్తృత్వం, భారత రాజ్యాంగంపై క్విజ్ పోటీలు జరగనున్నాయి.

29న క్రీడాకారుల ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 29న పురుషులు, మహిళల జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్టు కాకినాడ జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్‌టెన్నిస్, స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్‌టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, వాలీబాల్, యోగా, రెజ్లింగ్ క్రీడాంశాల్లో 29వ తేదీ ఉదయం 9 గంటలకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఎంపికలు ప్రారంభమవుతాయి. (ఓపెన్) నాన్ యూనిఫాం ప్రభుత్వ ఉద్యోగులై ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్, ఇటీవల తీయించుకున్న పాస్‌పోర్టు సైజు ఫొటో ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. అభ్యర్థులకు ఎటువంటి టీఏ, డీఏ ఇవ్వరు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోగా ఏఏ క్రీడల్లో పాల్గొంటారో స్వయంగా లేదా dsakakinada2023@gmail.com మెయిల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

నేడు కాకినాడలో 'ఏఐ ఫ్యూజన్' సదస్సు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని వివేకానంద పార్కు సమీపంలో గల గోదావరి కళాక్షేత్రంలో 'ఏఐ ఫ్యూజన్-2025' పేరిట గోదావరి ప్రాంతంలో తొలి కృత్రిమ మేధస్సు సదస్సును శుక్రవారం నిర్వహించనున్నారు. పరిశ్రమల యజమానులు, ఆవిష్కర్తలు, స్టార్టప్స్, పరిశోధకులు ఏఐ రంగంలోని తాజా ధోరణులు, భవిష్యత్ అవకాశాలపై చర్చించనున్నారు. స్టార్టప్స్ విభాగంలో ప్రతిభ కనబరిచిన వారికి ఏఐ ఇనోవేషన్ అవార్డులు ప్రదానం చేసి గౌరవించనున్నారు. 2026 ఫిబ్రవరిలో జరిగే జాతీయ స్థాయి ఏఐ ఫ్యూజన్ సదస్సులో దేశవ్యాప్తంగా 38 ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని నిర్వాహకులు చెప్పారు.





మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభుడు (పైన) పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయస్వామి (ఎడమ)

నేటి నుంచి పాదగయలో
దత్త దీక్షల స్వీకరణ

మహా సంస్థానంలో వచ్చే నెల 28 నుంచి దత్తజయంతి సప్తాహ మహోత్సవాలు

పిఠాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసియున్న స్వయంభూ శ్రీపాదశ్రీవల్లభ దత్తాత్రేయస్వామి సన్నిధిలో దత్త జయంతి సందర్భంగా శుక్రవారం దత్త మహామండల దీక్ష ప్రారంభించనున్నారు. భక్తులు సర్వాభీష్టసిద్ధికై దీక్ష చేపట్టవచ్చని ఆలయ వేదపండితులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకు భక్తులకు మాలధారణ ప్రారంభమవుతుంది. అర్ధ మండల దీక్షకు నవంబరు 12న, సప్తాహ దీక్షకు నవంబరు 26న మాలధారణ జరుగుతాయి. డిసెంబరు 3న ఇరుముడి ధారణ, అదేరోజు సాయంత్రం దత్తస్వాముల నగరోత్సవం, డిసెంబరు 4న దత్త జయంతి సందర్భంగా తెల్లవారుజామున శ్రీదత్త దీక్షా విరమణ, మహా పూర్ణాహుతి, స్వామికి మహాపూజ నిర్వహిస్తారు. విఠలానంద మహారాజ్ ఆశీస్సులతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా దత్తసాయి సేవా సమితి అధ్యక్షుడు వాడ్రేవు శ్రీనివాసరావు గురుస్వామి మాలధారణ చేస్తారు. దత్త దీక్షల స్వీకరణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు.

పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో నవంబరు 28 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు జరగనున్నాయి. ఇందులో పాల్గొనేందుకు ఉత్తరాది, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా తరలిరానున్న నేపథ్యంలో అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభించారు. దత్త జయంతి సప్తాహ మహోత్సవాల్లో ప్రతిరోజూ మహాగణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్రనామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, రుత్విక్కులచే మూలమంత్ర అనుష్టానం, గణపతి అథర్వ శీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణ, సాయంత్రం నాలుగు గంటలకు అగ్నిప్రతిష్ఠాపన, దత్త మంత్ర హోమం, ఐదు గంటలకు శ్రీపాదశ్రీవల్లభుల దివ్యపాద పద్మములకు వివిధ హారతులు, స్వామివారికి పల్లకీ సేవ, సాయంకాలార్చన, మంగళహారతి జరుగుతాయి. నవంబరు 28న దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు సర్వపుష్పపూజ, 29న లక్ష బిల్వార్చన, 30న సహస్ర చామంతి పూజ, డిసెంబరు 1న లక్ష తులసి అర్చన, 2న సహస్ర లిల్లీ పుష్ప పూజ, 3న గులాబీ అర్చన, సంపెంగ పుష్ప పూజ, 4న పూలంగి సేవ, బిల్వార్చన, పూర్ణాహుతి జరుగుతాయి. ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో ఆర్.సౌజన్య చెప్పారు.



వెండి నాగాభరణం అందజేస్తున్న వెంకట సతీష్-స్వాతి దంపతులు

రాచపల్లి అరుణాచలేశ్వరునికి వెండి నాగాభరణం బహూకరణ

ప్రత్తిపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలోని అరుణాచలేశ్వరస్వామికి కాకినాడకు చెందిన గుంటి వెంకటసతీష్-స్వాతి దంపతులు, వారి కుమార్తె జ్యోత్స్న రూ.20లక్షలు విలువచేసే వెండి నాగాభరణం చేయించారు. గురువారం దానిని ఆలయ వ్యవస్థాపకుడు స్వామి రమణానందకు అందజేశారు. అనంతరం నాగాభరణాన్ని వేదపండితుల మంత్రోచ్ఛారణలతో అరుణాచలేశ్వరునికి అలంకరించారు. కార్తీక మాసం రెండో రోజు స్వామికి పంచామృత అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన జరిపి పంచ హారతులు ఇచ్చారు.



వెండి నాగాభరణాన్ని స్వామికి అలంకరించిన దృశ్యం

సామర్లకోటలో రైల్వే డీఆర్ఎం

రైల్వే ట్రాక్, ముంపు ప్రాంతాల పరిశీలన

సామర్లకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ మోహిత్ సోనాకియా గురువారం సామర్లకోట విచ్చేశారు. మూడు రోజుల క్రితం వరద నీటితో రైల్వే ట్రాక్ మొత్తం ముంపునకు గురవ్వడంపై 'ఆంధ్రజ్యోతి'లో వరుసగా వచ్చిన కథనాలను ఆయన అధికారుల నుంచి సేకరించారు. ట్రాక్ ముంపు సమస్య, స్తంభించిన సిగ్నలింగ్ వ్యవస్థలపై డీఆర్ఎంకు స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్, ఏఈఎన్ ప్రభాకర్, చీఫ్ సిగ్నలింగ్ అధికారి చిరంజీవి సమగ్రంగా వివరించారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి ట్రాక్‌ను పరిశీలించారు. రైల్వే స్థలాలతో పాటు పూర్వం నుంచీ ఉన్న పంట మార్గాలు నేడు కనిపించకుండా పోయినందునే ముంపు బెడద తలెత్తుతోందని రైల్వే అధికారులు డీఆర్ఎంకు వివరించారు. రైల్వే శాఖకు పూర్వం నుంచీ ఉన్న స్థలాలను సర్వే చేసి శాశ్వత ప్రాతిపదికన డ్రైన్లు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రైల్వే ట్రాక్ వెంబడి ఉన్న చెరువులకు లీజు పరిమితి 2029 వరకు ఉందని చెప్పగా పరిమితి పూర్తయిన అనంతరం లీజు నిలిపివేయాలని డీఆర్ఎం సూచించారు. వివిధ శాఖల అధికారులతో వాస్తవంగా ఉన్న రికార్డుల మేరకు సర్వే చేయించి రైల్వే లేదా ప్రభుత్వ స్థలాల్లో శాశ్వత ప్రాతిపదికన డ్రైన్లు నిర్మించి ట్రాక్ పైకి భవిష్యత్తులో వరద నీరు రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువు నుంచి తాత్కాలికంగా తవ్విన కాలువను పరిశీలించారు. 3, 4, 5, 6 ట్రాక్‌లపైకి వరద నీరు చేరకుండా ప్రస్తుతం వున్న మూడు మోటార్లతో పాటు మరో రెండు మోటార్లతో వరద నీటిని పంపింగ్ చేసి బయటకు పంపాలని ఏఈఎన్ ప్రభాకర్‌కు సూచించారు.



రైల్వే ట్రాక్ పైకి వరద నీరు చేరకుండా ప్రత్యేకంగా తవ్విన కాలువను చూస్తున్న డీఆర్ఎం సోనాకియా

భావనారాయణస్వామి ఆలయ ఈవోగా శ్రీనివాసరావు



సర్పవరం జంక్షన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి (గ్రేడ్-1)గా ఆర్.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఆయన చెప్పారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఈవోగా పనిచేసిన తలాటం సూర్యనారాయణని అభినందించారు.

పిఠాపురం పాదగయలో పూజలు

పిఠాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రానికి విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజరు మోహిత్ సోనాకియా దంపతులు గురువారం విచ్చేశారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఆలయ పండితులు క్షేత్ర ప్రాశస్త్యం వివరించి ఆశీర్వచనాలు అందించారు. డీఆర్ఎం దంపతులను కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి-అమ్మవార్ల చిత్రపటం అందజేశారు. డీఆర్ఎం వెంట సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజరు మద్దింశెట్టి రమేష్, ఆలయ పండితులు వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, అల్లంరాజు చంద్రమౌళి, సూపరింటెండెంట్ వీరభద్రరావు, రెడ్నం ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దత్తాత్రేయ వున్నారు.



డీఆర్ఎం సోనాకియాకు ప్రసాదం అందజేస్తున్న ఈవో జగన్మోహన శ్రీనివాస్

జేఎన్టీయూకే, ఎస్టీబీఐఎఫ్, గోవిన్ హోల్డింగ్స్ మధ్య అవగాహన ఒప్పందం



ఎంవోయూలు మార్చుకుంటున్న జేఎన్టీయూకే వీసీ ప్రసాద్, ఇతర సంస్థల ప్రతినిధులు

జేఎన్టీయూకే, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని వైస్ చాన్సలర్ సమావేశ హాల్లో జేఎన్టీయూకే, విశాఖపట్నంలోని ఎస్టీబీఐఎఫ్, సింగపూర్‌లోని గోవిన్ హోల్డింగ్స్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్టు ఎస్ఆర్ఐఐసీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ తెలిపారు. జేఎన్టీయూ ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్, గోవిన్ హోల్డింగ్స్ అధినేత ఆనంద్ గోవిందలూరి, ఏపీ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ నెట్‌వర్క్ చైర్మన్ శ్రీధర్ కొసరాజు సంతకాలు చేసి అవగాహన ఒప్పంద పత్రాలను ఒకరికొకరు మార్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా ఈ సంస్థలు ఆవిష్కరణాత్మక పరిశోధన, స్టార్టప్ ఎకో సిస్టమ్ అభివృద్ధి, అంతర్జాతీయ మార్కెట్ ప్రవేశానికి వేదికలు సృష్టించడం, గ్లోబల్ సహకార అవకాశాలను అన్వేషించడం వంటి రంగాల్లో పరస్పర సహకారం అందించుకోనున్నాయి. ఈ సందర్భంగా ఆనంద్ గోవిందలూరి సమాజానికి నైతిక స్టార్టప్‌ల ప్రభావం అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు పలువురు డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామాంధుడి కథ ముగిసింది

(5వ పేజీ తరువాయి)

తుని రూరల్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికను అత్యాచారం చేసిన నిందితుడు నారాయణరావు (62)ను పోలీసులు బుధవారం సాయంత్రం అరెస్ట్ చేయగా, అతడి తక్షణం అరెస్ట్‌తో తగిన శాస్తి జరిగిందని అంతా అనుకున్నారు. పోలీసులు సైతం తమకు పక్కా ఆధారాలతో వీడియో దొరకడం, బాధితురాలిచ్చిన వివరాలు, వైద్య పరీక్షల నివేదిక ఆధారంగా నిందితుడు అత్యాచారం చేసినట్టు నిర్ధారణ అవడంతో రిమాండ్‌కు తరలించడానికి ఏర్పాట్లు చేశారు. తుని మేజిస్ట్రేట్ ముందు నిందితుడిని హాజరుపర్చడానికి పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందు కోసం వీడియో సాక్ష్యం, ఎఫ్ఐఆర్, ప్రాథమిక ఆధారాలు సిద్ధం చేశారు. కానీ తుని మేజిస్ట్రేట్ అందుబాటులో లేకపోవడంతో ప్రత్తిపాడు మేజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చేందుకు బయలుదేరారు.

బహిర్భూమికి వెళ్లాలని జీపు ఆపి..

రాత్రి పది గంటలకు తునిరూరల్ పోలీసులు నిందితుడిని జీపులో ఎక్కించి ప్రత్తిపాడు మేజిస్ట్రేట్ వద్దకు బయలుదేరారు. కాగా, తాను బహిర్భూమికి వెళ్లాలని జీపు ఆపాలని నిందితుడు కోరాడు. ప్రత్తిపాడులో వెళ్తున్న పోలీసులు చెప్పినా వెంటనే ఆపాలంటూ ఒత్తిడి తెచ్చాడు. దీంతో తుని పట్టణ శివారులోని కోమటి చెరువు వద్ద పోలీసులు జీపు ఆపారు. అదే సమయంలో వర్షం పడుతుండడంతో పక్కనే ఉన్న చెట్టు కిందకు ఎస్కార్ట్ సిబ్బంది వెళ్లి నిలబడ్డారు. ఈలోపు నిందితుడు పక్కనే ఉన్న చెరువులోకి దూకేశాడు. ఒక్కసారిగా శబ్దం విన్న పోలీసులు చెరువులోకి దిగి గాలించే ప్రయత్నం చేశారు. కానీ జాడ కనిపించలేదు. వెంటనే ఫైర్‌స్టేషన్‌కి ఫోన్ చేయగా వారు కూడా చాలాసేపు వెతికారు. అయినా జాడ కనిపించలేదు. దీంతో ఉదయాన్నే గజ ఈతగాళ్లను పిలిపించి చెరువులో గాలించారు. వలలు వేసి వెతికారు. చెరువు మధ్యలో కరెంట్ స్తంభం సమీపంలో నిందితుడి మృతదేహం వలకు చిక్కింది. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు మృతుడు నారాయణరావుగా నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మరోపక్క నిందితుడు బుధవారం రాత్రి జైలుకి వెళ్లి ఉంటాడని అనుకున్న వారందరికీ గురువారం ఉదయం మృతి వార్త తెలియడంతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

రోజంతా పోలీసుల బందోబస్తు..

అత్యాచార నిందితుడు నారాయణరావు మృతి చెందడం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గురువారం సంచలనమైంది. నిందితుడు తప్పించుకుని పారిపోయే క్రమంలో చనిపోవడంతో పీడవిరగడైందని చర్చోపచర్చలు జరిగాయి. మరోపక్క నారాయణరావు మృతి సమాచారం తెలియడంతో అతడి కొడుకు, కోడలు, కూతురు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వారెవరూ కనీసం విచారం వ్యక్తం చేయపోవడం విశేషం. నారాయణరావు చేసిన పాపానికి శిక్ష పడిందే కరెక్ట్ అంటూ కుటుంబీకులు సైతం అసహ్యించుకున్నారు. నిందితుడికి బుధవారం రాత్రి బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు దేహశుద్ధి చేసినప్పుడే తమకు అతడు చేసిన తప్పు అర్థమై దూరంగా ఉన్నామని వివరించారు. స్టేషన్‌కు పోలీసులు తీసుకువెళ్లినప్పుడు కూడా పరిశీలించామన్నారు. అయితే నిందితుడు రాత్రి చనిపోయిన విషయాన్ని దాచేసి కోర్టుకు తీసుకువెళ్లడం కోసం తమవద్ద పోలీసులు సంతకం తీసుకున్నారని కొడుకు, కోడలు వాపోయారు. నిందితుడు చనిపోయాడని రాత్రే నిజం చెబితే తామే సంతకం పెట్టేవాళ్లమని వివరించారు. నిందితుడు చెరువులో దూకిన ప్రాంతం వద్ద పోలీసులు రోజంతా బందోబస్తు నిర్వహించారు. అక్కడ ఎలాంటి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా నిఘా ఉంచారు. నారాయణరావు మృతదేహాన్ని పోలీసులు తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. శవపంచనామా చేసి కుటుంబీకులకు ఒకరు సంతకం చేయాలని పోలీసులు కోరినా ఎవరూ ముందుకు రాలేదు. నారాయణరావు ఇద్దరు భార్యలున్నారు. వీరిద్దరికీ సమాచారం ఇచ్చినా మధ్యాహ్నం వరకు ఎవరూ మృతదేహం కోసం ముందుకు రాలేదు. దీంతో సాయంత్రం శవపంచనామా పూర్తయింది.

వైరల్ వీడియోపై పోలీసులు రంగంలోకి..

తొండంగి తోటలో నిందితుడు నారాయణరావు మైనర్ బాలికను అత్యాచారం చేసిన వీడియోలు బుధవారం నుంచీ వైరల్ అవుతున్నాయి. ఈ వీడియోలో బాలిక వీడియోలు స్పష్టంగా కనిపిస్తుండడాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణించారు. బాలికను కనిపించేలా ఇలా వీడియోలు పోస్ట్ చేసిన వారిపై పోలీసులు గురువారం దర్యాప్తు ప్రారంభించారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు వీడియోలు తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని, కానీ ఇలా సోషల్ మీడియాలో వైరల్ చేయడం వల్ల బాలిక భవిష్యత్తు ఇబ్బందులు వస్తాయని పోలీసులు హెచ్చరించారు. గురువారం సాయంత్రంలోగా వీటిని సోషల్ మీడియా నుంచి తొలగించాలని బాధ్యులను హెచ్చరించారు. లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానీ చాలామంది నుంచి స్పందన లేదు. ఈ నేపథ్యంలో వీటిని పరిశీలించిన పోలీసులు గురువారం సాయంత్రం వైసీపీ మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్య అనుచరుడు గణేశుల వీరబాబు (35)పై కేసు నమోదు చేశారు. అత్యాచార వీడియోలు, నిందితుడి తనయుడు హోంమంత్రి అనిత అనుచరుడిగాను, నిందితుడు మాజీమంత్రి యనమలతోను ఉన్నట్టు మార్ఫింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేయడాన్ని గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు.

మృతదేహం వద్ద కుటుంబికుల రోదన



తండ్రి మృతదేహం వద్ద విలపిస్తున్న కుమార్తె

తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లు గప్పి తప్పించుకునే ప్రయత్నంలో కామాంధుడు నారాయణరావు చెరువులో మునిగి బుధవారం రాత్రి మృతిచెందాడు. కాగా, రాత్రి కురిసిన వర్షం కారణంగా బయటకు తీసేందుకు వీలు లేకపోవడంతో గురువారం వేకువజాము నుంచే నారాయణరావు మృతదేహం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని వెలికితీయడంతో కొడుకు సురేష్, కూతురు నాగలక్ష్మి, కోడలు రాజేశ్వరి మృతదేహం వద్దకు వచ్చారు. అక్కడ ఆందోళన వ్యక్తం చేసిన కొడుకు సురేష్, కోడలు రాజేశ్వరి, తమ తండ్రి చేసిన పనికి శిక్ష పడాల్సిందేనని కానీ చెరువులో పడి చనిపోవడంపై అనుమానాలు ఉన్నాయన్నారు. అనంతరం మృతదేహాన్ని పోలీసులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉంటే అత్యాచారానికి గురైన బాలిక తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

గురుకులంలో అధికారుల విచారణ



పాఠశాలలో విచారణ చేపడుతున్న దృశ్యం

తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల విద్యార్థినిపై వృద్ధుడు తాటిక నారాయణరావు అత్యాచారానికి ఒడిగట్టడం సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. దీంతో గురుకుల పాఠశాల ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. స్టేట్ సెక్రటరీ మస్తానయ్య, జాయింట్ సెక్రటరీ అబ్దుల్లా, ఐదుపురు పాఠశాల ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులతో సమావేశమై బాలిక బయటకు వెళ్లడానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నారాయణరావు అనే వ్యక్తి బాలిక తాతయ్యగా చెప్పుకుని పలుమార్లు పాఠశాలకు తీసుకువెళ్లడానికి వచ్చాడని, గతంలో బాలికను తీసుకుని వెళ్లి మళ్లీ తీసుకువచ్చి, తీసుకువెళ్లాడన్నారు. ఈ నేపథ్యంలో ఆ విషయాలు రెండు సార్లు బాలికను బయటకు తీసుకెళ్లడన్నారు. తాతయ్యగా నమ్మిన సిబ్బంది బయటకు పంపించడం జరిగిందని, విద్యార్థిని కూడా తమ తాతయ్య అని ధ్రువీకరించిందన్నారు.

ప్రమాదవశాత్తు కత్తి తలపై పడి ఒకరి మృతి

నల్లజర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కత్తి జారి తలపై పడిన ఘటనలో కూలీ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన దూబచర్లలో గురువారం చోటుచేసుకుంది. నల్లజర్ల పోలీసులు వివరాలివి.. జగన్నాథపురం గ్రామానికి చెందిన పేర్ల నాగేశ్వరరావు (35)కొంతమందితో కలిసి దూబచర్లలో ఆయిల్‌పాం గెలలు కోసేందుకు ఉదయం వెళ్లారు. కాగా, నాగేశ్వరరావు కత్తితో గెలలు కోస్తున్న సమయంలో ఇనుప గెడకు ఉన్న కత్తి పై నుంచి జారి తలపై పడడంతో తీవ్ర రక్త స్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయనకు భార్య పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

కరిచర్లగూడెం మాతంగమ్మ ఆలయంలో చోరీ

గోపాలపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కరిచర్లగూడెం గ్రామ శివారులో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మాతంగమ్మ ఆలయంలో చోరీకి పాల్పడినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ శివారులో జాతీయ రహదారి అనుకుని ఉన్న ఆలయంలో బుధవారం రాత్రి ఆలయంలో చొరబడి ఉన్న డబ్బీని పగలగొట్టి అందులో ఉన్న సొమ్మును అపహరించుకుపోయినట్టు తెలిపారు. ఇటీవలే ఆలయ వద్ద దసరా ఉత్సవాలు నిర్వహించామని, దీంతో రూ. 10 నుంచి 15000 వేల వరకు హుండీలో అమ్మవారి కానుకలు ఉన్నాయన్నారు. అలాగే గోపాలపురంలోని కనకదుర్గమ్మ వారి ఆలయంలో కూడా బుధవారం రాత్రి చోరీ జరిగినట్టు విశ్వసనీయ సమాచారం.

డిప్యూటీ సీఎంను కలిసిన కొత్తపేట ఎమ్మెల్యే

కొత్తపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలో ముఖ్యమైన 12 రోడ్ల నిర్మాణం కోసం రూ.18.33 కోట్ల నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. ముఖ్యంగా రావులపాలెం జాతీయ రహదారి నుంచి వాడపల్లి వరకు ఏటిగట్టు రహదారి నిర్మాణం అవసరమని, దీనికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం దినదిన ప్రవర్ధమానంగా వెలుగొందుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకోవాలని ఆహ్వానించారు. అలాగే గోదావరి డెల్టా ఆధునీకరణ పనులు మంజూరు చేయాలన్నారు. వీటిపై పవన్ సానుకూలంగా స్పందించినట్టు ఆయన వివరించారు.

వాడపల్లి క్షేత్రానికి రూ. 6 కోట్లు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతిని గడించిన వాడపల్లి వెంకటేశ్వరస్వామి క్షేత్రానికి డిప్యూటీ సీఎం పవన్ రూ.6 కోట్ల నిధులు మంజూరు చేశారు. గురువారం రాత్రి మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వాడపల్లి క్షేత్రం గురించి వివరించి గోదావరి ఏటిగట్టు రహదారికి నిధులు మంజూరు చేయాలని కోరగా, తక్షణమే స్పందించి పంచాయతీ రాజ్ ద్వారా నిధుల విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

వాడపల్లి వెంకన్న కొబ్బరి చెక్కల వేలం పాట
ఆదాయం రూ.1.63 కోట్లు



వాడపల్లిలోని ఆలయంలో వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

ఆత్రేయపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన వేలం పాటల్లో స్వామివారికి అధిక ఆదాయం లభించింది. ఏడాది కాలానికి నిర్వహించిన కొబ్బరి చెక్కల వేలం పాటలో సదరు పాటదారుడు రూ.1,63,33,333 హెచ్చుపాటను సొంతం చేసుకున్నారు. గత ఏడాది రూ.60,77,879కి పలికింది. అలాగే పట్టికి బెల్లంకు నిర్వహించిన వేలం పాటలో రూ. 18,09,000 రాగా, గతంలో రూ.12,35,000, తిరు తలకొరణకు నిర్వహించిన వేలం పాటలో రూ.17,99,299 రాగా, గతంలో రూ.15,66,666 పాట దక్కించుకున్నారు. అధిక ఆదాయం లభించిన ఈ పాటలలో బహిరంగ వేలం సీల్డ్ టెండర్లు, ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. వేలంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే మానసిక ఆరోగ్యం

- కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్
- ఆర్ఎంసీలో డ్రగ్స్ నియంత్రణపై సదస్సు

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడిని అధిగమించడం తద్వారా మానసికంగా, శారీరకంగా ప్రశాంతత లభిస్తుందని కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ అన్నారు. ఆర్ఎంసీలో డ్రగ్స్ నియంత్రణపై గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు (డ్రగ్స్) ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబాలను నాశనం చేస్తున్నాయన్నారు. ప్రస్తుత వైద్య విద్యార్థులు భవిష్యత్తు వైద్యులుగా మారి సమాజానికి ఆదర్శం కావాలన్నారు. మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ వి.వరప్రసాద్ మాట్లాడుతూ ప్రశాంతమైన మనస్సు, ఆరోగ్యవంతమైన శరీరం వైద్య విద్యార్థులకు ముఖ్యమన్నారు. ఆందోళన, ఒత్తిడి సమస్యలు ఉంటే ఆర్ఎంసీలోని కౌన్సెలింగ్ సెల్ లేదా మెంటల్ హెల్త్ సపోర్ట్ సిస్టం ఉందన్నారు. అవసరమైన వారు మెంటర్స్/అధ్యాపకులు/ కౌన్సిలర్లను సంప్రదించాలన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు తొలగిన వైట్ కోట్ కరుణ, క్రమశిక్షణ, వినయం ... ముఖ్యంగా సేవాభావాన్ని గుర్తు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయశేఖర్, డాక్టర్ శశి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభశ్రీనివాసన్, డాక్టర్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువకులపై పోక్సో కేసు

సౌత్‌జోన్ డీఎస్పీ భవ్య కిషోర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్య

రాజమహేంద్రవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేశారు. ఈ మేరకు వివరాలను సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ గురువారం తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో ఉంటున్న ఓ బాలిక దీపావళి టపాసులు కొనుక్కొనేందుకు బయటకు వెళ్లింది. ఆ బాలికతో ముందుగానే పరిచయం ఉన్న పాము అజయ్‌తోపాటు అతడి స్నేహితుడు అదే సమయంలో హాస్టల్ వద్దకు వచ్చారు. తాము కూడా దీపావళి బాణసంచా కొనేందుకు వెళుతున్నామని మాయమాటలు చెప్పి బాలికను బైక్ ఎక్కించుకుని రైల్వే స్టేషన్ సమీపంలోని శ్రీరామ్ లాడ్జికి తీసుకెళ్లారు. స్నేహితుడు లాడ్జి బయట ఉండగా, బాలికను అజయ్ రూమ్‌లోకి తీసుకెళ్లి అత్యాచారం చేసి, వసతి గృహం వద్ద వదిలి వెళ్లాడు. బాలిక గాబరా ప్రవర్తనను గమనించిన వార్డెన్ ప్రశ్నించగా జరిగిన విషయాన్ని చెప్పినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. దీంతో పోక్సో కేసు నమోదు చేసి అజయ్‌తోపాటు కాతేరుపల్లి సత్యసాయిని అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టామన్నారు. శక్తి టీంలను అప్రమత్తం చేశామన్నారు. వసతి గృహాలకు పంపించి కౌన్సిలింగ్ చేయిస్తున్నామన్నారు. లాడ్జి నిర్వాహకులు, యజమానులు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని, అనుమానమొస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ కోరారు. ఉదాసీనంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

● టూటౌన్ పరిధిలో జరిగిన ఇది రెండో దురదృష్టకర ఘటన కావడం గమనార్హం. నెల క్రితం పోలీస్ స్టేషన్‌కు సమీపంలోనే రాత్రి గస్తీ విధుల్లో ఉన్న ఒక కానిస్టేబుల్, ఆలోగ్యంపై అసాంఘిక వ్యక్తులు దాడి చేసి కానిస్టేబుల్‌ని కొట్టారు. జిల్లాలో పోలీసులపై ఇలాంటి ఘటన ఇదే మొదటిసారి కావడంతో సంచలనమైంది.ఇప్పుడు పోలీస్‌స్టేషన్‌కి కూతవేటు దూరంలోనే ఉన్న లాడ్జిలో అఘాయిత్యం జరిగింది. దీంతో నిఘా పేలవంగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పైగా రైల్వేస్టేషను ఏరియా సున్నిత ప్రాంతం కావడంతో స్టేషనుపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలనే వినతులు వినవస్తున్నాయి. కేసులో ప్రతిభ చూపిన సీఐ శివ గణేష్, ఎస్ఐ శ్యాంసుందర్, హెచ్‌సీ భానుమూర్తి, కానిస్టేబుళ్లు రత్నాని, మహేశ్‌కుమార్, నాగబాబు, బాలసుబ్రహ్మణ్యాన్ని ఎస్పీ కిషోర్ అభినందించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి



రావులపాలెంలో బస్సు ఢీకొని మృతిచెందిన కోటమ్మ

రావులపాలెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన ఆదపాల కోటమ్మ(61) వ్యక్తిగత పనులపై రావులపాలెం వచ్చి పని ముగించుకుని స్వగ్రామం వెళ్లేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు నడుచుకుంటూ వెళ్లింది. ఆ సమయంలో భీమవరం డిపోకు చెందిన బస్సు కోటమ్మను బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన ఆమెను 108 అంబులెన్స్ ద్వారా కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలు మనవడు ఉండపల్లి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చంటి తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

మరొకరికి గాయాలు



మృతుడు రేగటి దేవుడు

కోటనందూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలం కేఓ అగ్రహారం శివారులో గురువారం బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. తుని మండలం ఎన్ఎస్ వెంకట నగరం గ్రామానికి చెందిన రేగటి దేవుడు(33), అతడి చిన్నాన్న యేసుకుమార్ అల్లిపూడిలో సోదరిని కలిసి కోటనందూరు వెళ్లి తిరిగి వస్తుండగా కేఓ అగ్రహారం శివారులో బైక్ అదుపు తప్పింది. దీంతో ఇద్దరికీ బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రేగటి దేవుడు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. యేసుకుమార్ చికిత్స పొందుతున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టానికి తరలించామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎటపాక, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం, రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన రాజుపేట గ్రామశివారు ప్రాంతంలో అక్రమంగా ఇసుక నిల్వలు ఉంచి గుట్టుచప్పుడు కాకుండా తెలంగాణలోని భద్రాచలం పట్టణానికి రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం తెల్లవారుజామున ఎస్ఐ జి.అప్పలరాజు పట్టుకున్నారు. గోళ్లగట్టు రోడ్‌లో ఓ ఇసుక ట్రాక్టర్‌ను, రాజుపేట నుంచి భద్రాచలం వెళ్తున్న మరో ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. కాగా రాజుపేట వద్ద రెండు చోట్ల అక్రమ ఇసుక నిల్వలు గుర్తించిన రెవెన్యూ అధికారులు సీజ్ చేయకపోవడం గమనార్హం. అయితే పట్టుబడిన రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ఘనంగా వైట్ కోట్ సెర్మనీ



రంగరాయలో వైద్య విద్యార్థికి వైట్ కోట్ తొడుగుతున్న డాక్టర్ విష్ణువర్ధన్

జీజీహెచ్(కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో వైట్ కోట్ సెర్మనీ గురువారం ఘనంగా జరిగింది. మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ వైట్ కోట్ తొడిగి వైద్యుడిగా నిర్వర్తించాల్సిన ధర్మాన్ని, వృత్తిలో మెలగాల్సిన విధానాన్ని, బాధ్యతలను తెలియజేశారు. వృత్తిపరమైన విధి నిర్వహణకు తెల్ల కోటు ప్రతీక అన్నారు. వైద్య విద్యార్థులు తెల్లకోటు వేసుకున్నప్పటి నుంచి పవిత్రమైన వైద్యవృత్తిని పవిత్రకర్తతో వ్యవహరించాలని సూచించారు.కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విజయశేఖర్, డాక్టర్ శశి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభశ్రీనివాసన్, డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాలింత మృతిపై విచారణ

పిఠాపురంలో వైద్యులు, సిబ్బంది, మృతురాలి బంధువుల నుంచి వివరాలు సేకరణ



పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో విచారణ నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

పిఠాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వాసుపత్రి)లో బాలింత మృతి ఘటనపై గురువారం విచారణ నిర్వహించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన దొండపాటి శ్రీదుర్గ డెలివరీ నిమిత్తం ఈనెల 13న ఆసుపత్రిలో చేరగా 14న బిడ్డను ప్రసవించిన అనంతరం అధిక రక్తస్రావమై సీరియస్ కావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ మరణించడం.. బిడ్డ అనారోగ్యానికి గురికావడంపై మృతురాలి బంధువులు ఆందోళన నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. దీనితో కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారిగైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ అనురాగమయి, పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ మాణిక్యం, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైతన్యరెడ్డి, జీజీహెచ్ ఏవో శ్రీమహేంద్రకర్ గురువారం పిఠాపురం చేరుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారణ జరిపారు. మృతురాలి బంధువులు, చికిత్స చేసిన వైద్యులు, సిబ్బంది, ఆ రోజు విధుల్లో ఉన్న పారా మెడికల్ స్టాఫ్ నుంచి వివరాలు సేకరించారు. మృతురాలి కేస్ షీట్, బిడ్డ ఆరోగ్యం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అందరి నుంచి వివరాలు తీసుకున్నామని, వీటిని క్రోడీకరించి నివేదిక రూపంలో కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఆదే విధంగా జూలై నెలలో ఇక్కడ డెలివరీ నిమిత్తం చేరగా కడుపులోనే బిడ్డ చనిపోయిందని విరవ కు చెందిన దంపతులు తమకు తెలియజేశారని చెప్పారు. దీనిపై పాడా కార్యాలయంలో ఫిర్యాదు ఇవ్వాలని సూచించినట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

గొల్లప్రోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సామర్లకోట మండలం గొంచాల గ్రామానికి చెందిన భార్యాభర్తలు గొల్లప్రోలు మండలం చేబ్రోలు వచ్చారు. అక్కడ పని ముగించుకుని గురువారం సాయంత్రం తిరిగి మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా అకస్మాత్తుగా వర్షం రావడంతో తడిసిపోకుండా ఉండేందుకు గానూ 216వ జాతీయ రహదారిపై చెందుర్తి సెంటర్ వద్ద ఉన్న దుకాణదేదీ గుడి వద్దకు మలుపు తిరిగారు. అదే సమయంలో కాకినాడ నుంచి విశాఖ వెళ్తే కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

పోలవరం భూముల్లో సాగును అడ్డుకున్న ఆదివాసీలు

- భూములపై కలెక్టర్, సబ్ కలెక్టర్ ఉత్తర్వులు అమలు చేయాలి
- లేకుంటే బైండోవర్ కేసులు: అధికారులు



ఆదివాసీలతో మాట్లాడుతున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

ఎటపాకఅక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం నందిగామ, ముర్మూరు గ్రామాల్లో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల భూముల్లో వ్యవసాయ పనులు చేస్తున్న పూర్వ యజమానులను గురువారం కొందరు ఆదివాసీలు అడ్డుకున్నారు. నందిగామ, ముర్మూరు గ్రామాల్లో పోలవరం ప్రాజెక్టు కోసం భూసేకరణలో భాగంగా సేకరించి, పరిహారం పొందిన భూముల్లో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మూడు నెలల క్రితం ఆదివాసీలు జెండాలు పాతడంతో వివాదం తలెత్తింది.దీనిపై భూముల పూర్వ యజమానులు కలెక్టరుకు, సబ్‌కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన భూసేకరణ ప్రక్రియ, పునరావాస ప్యాకేజీ పూర్తయ్యేవరకు పూర్వ యజమానుల ఆధీనంలో ఆ భూములు ఉంటాయని, ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ శుభం నొఖ్వాల్ గత నెల 30న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో పూర్వ యజమానులు ఈ రెండు గ్రామాల్లోని భూముల్లో వ్యవసాయ పనులు మొదలు పెట్టగా ఆదివాసీలు అడ్డుకున్నారు. దీంతో తహసీల్దార్ కారం సుబ్బారావు, ఎస్ఐ అప్పలరాజు అక్కడికి వెళ్లారు. ఈ భూములపై కలెక్టర్ దినేష్‌కుమార్, సబ్‌కలెక్టర్ శుభం నొఖ్వాల్ స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చాయని, ఎవరైనా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పూర్వ యజమానులు సాగు చేయకుండా భూములను కౌలు ఇస్తే వారిపై కూడా ఎల్టీఆర్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

నేడు భారత్ బంద్

- మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట లేఖ
- అప్రమత్తమైన పోలీసులు



చింతూరులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చింతూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ పేరిట నిరసిస్తూ నేడు భారత్ బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది.ఆ మేరకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్‌పేరిట లేఖ విడుదలైంది. దీంతో ఏజెన్సీలో పోలీసులు అప్రమత్తమయ్యారు. మన్య రాష్ట్రాలైన తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చింతూరు భద్రాచలం నడుమ జాతీయ రహదారి 30పై గురువారం రాత్రి రాకపోకలను నిలువరించారు. భద్రాచలం వైపు వెళ్లే ప్రైవేటు వాహనాలను కూనవరం మీదుగా మళ్లించారు. మరోవైపు చింతూరు, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో కూడా రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎటపాక, చింతూరు, కూనవరం మండలాల మీదుగా మన్య రాష్ట్రాలలోని విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడలతో పాటు తెలంగాణ, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను గురు, శుక్రవారాల్లో నిలిపి దూర దూరాలకు వెళ్లే సర్వీసులను నిలిపివేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. జాతీయ రహదార్ల అభివృద్ధి పనులు వినియోగించే వాహనాలను బంద్ ప్రభావం ముగిసేంత వరకు సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాల్సిందిగా పోలీసులు సంబంధిత కాంట్రాక్టర్లను సూచించారు. అనుమానిత ప్రదేశాల్లో నిఘా పెంచామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

దివాన్‌చెరువు గ్రామ సందర్శనలో జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి



డీపీవో శాంతామణికి సమస్యలు వివరిస్తున్న కూటమి నాయకులు

దివాన్‌చెరువు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా పంచాయతీ అధికారి శాంతామణికి అన్నారు. దివాన్‌చెరువు పంచాయతీలో రోజు వారీ చెత్త సేకరణ, ఐవీఆర్‌ఎస్ కాల్స్, స్వర్ణ పంచాయతీ ద్వారా ఇంటి పన్నుల వసూలు కార్యక్రమాలను పరిశీలించేందుకు గురువారం ఆమె గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు కూటమి నాయకులు ఆమెను మాట్లాడారు. పంచాయతీకి సంబంధించిన రెండు ట్రాక్టర్లు మరమ్మతులకు గురయ్యాయని దీనితో గ్రామంలో పారిశుధ్యం సరిగా జరగడం లేదని చెప్పారు. పారిశుధ్య సిబ్బందికి మూడునెలలుగా జీతాలు నిలిచిపోయాయని, ఈ విషయాలను గ్రామసభలో తాము అడుగుతున్నా పరిష్కారం కావడం లేదని వాపోయారు. ఈ సమస్యలు కారణంగా గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాలపై శ్రద్ధ వహించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డీపీవోను కోరారు. కార్యక్రమంలో నాయకులు కందుల బాబూరాయుడు, పంచికట్ల నాగు, యర్రంశెట్టి శ్రీను, ఖండవిల్లి లక్ష్మి, పెనుగొండ చిన్ని, ఈతకోట ఆనందరావు, బెజవాడ దుర్గాప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో వాణి, కార్యదర్శి కె.హనుమంతరావు పాల్గొన్నారు.

హాస్టల్ బాలికలకు పటిష్ట భద్రత కల్పించాలి

కలెక్టరేట్ వద్ద ధర్నాలో సీపీఐ-మహిళా సమాఖ్య



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ-మహిళా సమాఖ్య

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సంక్షేమ బాలికల వసతి గృహాల్లో చదువుకుంటున్న బాలికలకు పటిష్టమైన భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ-మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్‌లో విద్యనభ్యసిస్తున్న బాలికపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. బాలికపై అత్యాచారం సంఘటన వెనుక చాలా అనుమానాలు వ్యక్తమౌతున్నాయని దీనిపై సమగ్ర విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ వసతి గృహాలపై నిఘా కొరవడిందన్నారు. ఏఎస్‌డబ్ల్యువో స్థానికంగా ఉండరని, చర్యలు తీసుకోవాలన్నారు.మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లావణ్య మాట్లాడుతూ ప్రతి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఘటన వెనుక పూర్తిగా నిర్లక్ష్యం కనిపిస్తోందని దీనికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, ఏఐటీయూసీ నాయకులు రెడ్డి రమణ, అల్లం వెంకటేశ్వరరావు,సప్ప రమణ, ఎ.త్రిమూర్తులు, సేపేని రమణమ్మ, టి.నాగేశ్వరరావు, నాగమణి, రామారావు, పి.దేముడు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణేది

మాజీ ఎంపీ భరత్ ధర్నా

రాజమహేంద్రవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదని రాజమండ్రి మాజీ ఎంపీ భరత్‌రామ్ ఆరోపించారు. బాలికల వసతి గృహంలోని బాలికపై అత్యాచారం జరగడమే దానికి నిదర్శనమని అన్నారు. వసతి గృహం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు చేతకానితనం వల్ల నియోజకవర్గంలోని మహిళలపై అత్యాచారాలు పెరిగాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు ఒక మహిళను ప్రేమ పేరుతో మోసగించి గర్భవతిని చేసి తర్వాత గర్భాన్ని తొలగింపజేశారని మండిపడ్డారు.

అండర్-17 బాలికల వాలీబాల్ జట్టు ఎంపిక



అండర్-17 బాలికల వాలీబాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థినులతో స్కూల్ గేమ్స్ ప్రతినిధులు

అనపర్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అనపర్తి జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14, 17 జట్ల ఎంపికలో భాగంగా గురువారం బాలికల అండర్-17 వాలీబాల్ జట్టు ఎంపిక జరిగింది. ఈ ఎంపికల్లో రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 200 మంది క్రీడాకారులు, 60 మంది వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే అండర్-17 బాలుర జట్టుకు ఎంపికకు వర్షం అడ్డంకి రావడంతో ఎంపికలను వాయిదా వేసినట్టు డివిజనల్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాకినాడ స్కూల్ గేమ్స్ సెక్రటరీ తదుపరి తేదీని ప్రకటిస్తారని ఆయన తెలిపారు.

నరసన్న కొండకు కార్తీక దీపోత్సవం

అన్నదానానికి రూ.4 లక్షల విరాళం



కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న పవన్‌కుమార్, ప్రత్యూషదేవి

కోరుకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభోత్సవం సందర్భంగా కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కార్తీక దీపోత్సవం గురువారం సాయంత్రం మొదలైంది. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కొండ 650 మెట్లకు దీపాలు వెలిగించి నెలరోజుల కార్తీక దీపోత్సవం ఎమ్మెల్యే బత్తుల కుటుంబ సభ్యులు ప్రారంభించారు. మొదటి రోజు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అల్లుడు తోట పవన్ కుమార్, కుమార్తె ప్రత్యూషదేవి దంపతులు స్వామిని దర్శించుకుని దీపాలు వెలిగించారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమానికి రూ.లక్ష విరాళం అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ రూ.3 లక్షల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయార్చకులు పెదపాటి గిరిధరాచార్యులు, వాడపల్లి నాగు ఆచార్యులు, సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, నాయకులు అడ్డాల శివ, బదిరెడ్డి దొర, కటకం చలం, పరస శ్రీను పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

- కమిషనర్ రాహుల్ మీనా
- గోదావరి పుష్కరాలకు మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ రాహుల్‌మీనా

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలకు మౌలిక సదుపాయల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ 2027 జూలైలో జరిగే గోదావరి పుష్కరాలకు అధికార యంత్రాగం ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలన్నారు. చేపట్టవలసిన పనులపై, అంచనా వ్యయంపై ప్రతిపాదనలు అందించాలని అన్ని విభాగాల అధిపతులకు సూచించారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాది మంది భక్తులకు అనుగుణంగా ఘాట్ల విస్తరణ, రహదారుల విస్తరణ, జంక్షన్ల అభివృద్ధి,పార్కింగ్ సహా అన్ని వసతుల కల్పన కోసం ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. దీర్ఘకాలిక, మధ్య, స్వల్పకాలిక పనులను విడివిడిగా గుర్తించాలన్నారు. మహాకుంభమేళాతో పాటు గతంలో వివిధ రాష్ట్రాలలో పుష్కరాలు, భక్తులకు అవసరమైన సౌకర్యాల రూపకల్పనలో అనుభవమున్న కన్సల్టెన్సీలతో మాట్లాడాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎస్ఈ ఇన్‌చార్జి రీటా, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, మేనేజర్ ఎండీ అబ్దుల్‌మాలిక్, ఈఈ మదర్షాలీ, మాధవి, సీవోసీ ఇన్‌చార్జి రవితేజ, అకౌంటెంట్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌ను కలిసిన గన్ని కృష్ణ

కార్పొరేషన్ కమిషనర్ రాహుల్‌మీనాను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను సత్కరించి మొక్కను అందించారు. రాబోయే పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని రాజమహేంద్రవరంలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించాలని, నగరాన్ని పర్యాటక, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయాలని గన్ని కృష్ణ సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, నిమ్మలపూడి గోవింద్, యిన్నమూరి రాంబాబు, మళ్ల వెంకట్రాజు, తంగెళ్ల బాబి, కేవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోష్పాదక్షేత్రంలో వేదశాస్త్ర సభ

కొవ్వూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక గోష్పాదక్షేత్రంలో వేద శాస్త్రాభివర్ధక పరిషత్ ఆధ్వర్యంలో టీటీడీ సహకారంతో గురువారం వేదశాస్త్ర సభను నిర్వహించారు.దోర్బల ప్రభాకర శర్మ, నోరి భోగేశ్వరశర్మ, గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనాపాటి, దువ్వూరు పాప కాశచైనులు, తంగిరాల సుబ్రహ్మణ్యం, చిన్నఆంజనేయ ఘనాపాటి తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

సీపీఎం ప్రాంతీయ కన్వీనర్ వాణిశ్రీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న వాణిశ్రీ

రంపచోడవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం నాగంపల్లి సీఆర్‌బీ క్రాషర్‌లో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన గిరిజన బాలుడు గుమాసుండి(17) మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ తక్షణమే బాలుడి కుటుంబానికి రూ.50లక్షలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఘటనపై లేబర్ కమిషనర్, జిల్లా కలెక్టర్, మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

టీడీపీ అనపర్తి అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి

బిక్కవోలుకు వెంకటరామారెడ్డి, రంగంపేటకు శ్రీనివాసరావు నియామకం



శ్రీనివాసరెడ్డి, వెంకటరామారెడ్డి, శ్రీనివాసరావు

అనపర్తి/రంగంపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి మండల నూతన కమిటీలను అధిష్టానం గురువారం ప్రకటించింది. అనపర్తికి పాత అధ్యక్షుడి పేరునే ఖరారు చేయగా బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాలకు నూతన అధ్యక్షులను ఎంపిక చేసింది. అనపర్తి మండలాధ్యక్షుడిగా కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, జనరల్ సెక్రటరీగా దంగేటి భాస్కరరావు, బిక్కవోలు మండలాధ్యక్షుడిగా పడాల వెంకటరామారెడ్డి(చిన బుజ్జి) జనరల్ సెక్రటరీగా బేరా రూప, రంగంపేట మండలాధ్యక్షుడిగా ఉద్దండరావు శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీగా అందిబోయిన అబ్బాయి.పెదపూడి మండలాధ్యక్షుడిగా తిబిరిశెట్టి గణేష్, జనరల్ సెక్రటరీగా అనుసూరి సూర్యభాస్కరరావులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి తదితరులు అభినందించారు. అలాగే రంగంపేటకు టీడీపీ వైస్ ప్రెసిడెంట్‌గా ఉండవిల్లి వీవీ శేషగిరిరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా అంచూరి సూరిబాబు, దూళ్ల వీర్రాజు, మేనెడ్డి నూకరాజు, సెక్రటరీలుగా సుంకవిల్లి వీర్రాజు, వాసంశెట్టి శ్రీనివాసు, మద్దూరి గంగరాజులు, ట్రెజరర్‌గా సింహాద్రి రాంబాబు ఎంపికైనట్టు మనోజ్‌రెడ్డి పేర్కొన్నారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక భగినీ హస్త భోజనం



బిక్కవోలులో సోదరి ఇంట భగినీ హస్త భోజనం స్వీకరిస్తున్న సోదరుడు

బిక్కవోలు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక భగినీ హస్త భోజనం. భగినీ హస్త భోజనం అంటే చెల్లెలు చేతి వంట అని అర్థం. దీపావళి తరువాత వచ్చే కార్తీక శుద్ధ విదియ నాడు ఈ పండుగను జరుపుకుంటారు. చెల్లెలు చేతి వంట తింటే అన్నకు అపమృత్యు దోషాలు తొలగి పోతాయని నమ్మకం. ఈ ఏడాది ఈ పండుగను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలో పలువురు చెల్లెళ్లు తమ అన్నలకు భగినీ హస్త భోజనం అందించి వారి నుంచి వివిధ కానుకలు పొందారు. ఓంశాంతి ఆశ్రమంలో భగిని హస్త కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బ్రహ్మకుమారి లక్ష్మి, భాగ్యం అక్కయ్య వచ్చిన అన్నయ్యలకు భగినీ హస్త భోజనాన్ని అందించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, సింగారపు రామారావు, బేరా శ్రీను, చాగంటి సాయిబాబారెడ్డి, వెంకట్రామయ్య భోజనాన్ని స్వీకరించారు.

ఉచిత ఆధార్ అప్‌డేషన్‌కు ప్రత్యేక కేంద్రాలు

బిక్కవోలు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాల్లో 5నుంచి 17 ఏళ్ల వయస్సు గల వారందరూ ఉచిత ఆధార్ అప్‌డేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ సూచించారు.ఆయన గురువారం మాట్లాడుతూ బిక్కవోలు సచివాలయం-2, ఊలపల్లి సచివాలయం-2, పందలపాక సచివాలయం-1లో ఉచిత ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేశారన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలో ఆధార్ అప్‌డేషన్ కాని విద్యార్థులను గుర్తించి ఆ విషయాన్ని వారి తల్లిదండ్రులకు తెలిపి, ఈ నెల 31లోగా ఆధార్ అప్‌డేషన్ చేయించేలా చూడాలన్నారు.

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఎన్ఎంఎంఎస్ మెటీరియల్‌తో పందలపాక హైస్కూల్ విద్యార్థులు

బిక్కవోలు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు బహూకరించిన ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయిలో ఉపకార వేతనాలు పొందాలని పందలపాక ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల సత్తిరాజు సూచించారు. గురువారం ఆయన ఈ మెటీరియల్‌ను ఈ పరీక్షలు రాసే 30మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు వీర్రెడ్డి, శ్రీనివాసరావు, నాగబాబు, వీరభద్రం, అంజనీకుమార్, సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై వైసీపీ నాయకుడి దాడి

● విరిగిన చెయ్యి.. కేసు నమోదు ● రాజీకి జనసేన నాయకుల యత్నం?



విరిగిపోయిన చెయ్యితో ఆర్టీసీ డ్రైవర్ మణికంఠ

నిడదవోలు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్‌పై వైసీపీ నాయకుడు దాడికి పాల్పడ్డాడు. దీంతో డ్రైవర్ చెయ్యి విరిగిపోయిన సంఘటన గురువారం డి.ముప్పవరంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజమహేంద్రవరం వెళుతూ డి.ముప్పవరం సెంటర్ వద్దకు చేరుకుంది. దీంతో అక్కడ ఉన్న ఒక ప్యాసింజర్‌ను ఎక్కించుకుని కొంచెం ముందుకు కదిలేసరికి అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడి సోదరుడు బస్సు ఎక్కాడు. అప్పటికే మద్యం తాగి ఉన్నాడు. కాగా, బస్సు పక్కనే ఉన్న సదరు వ్యక్తి సోదరుడు, వైసీపీ నాయకుడు ఎందుకు బస్సు ఆయన ఆపమన్న చోట ఆపలేదని డ్రైవర్‌తో గొడవపడి కుడి చేతిని బయటకు లాగుతూ ముఖంపై దాడి చేసినట్టు బస్సులోని ప్రయాణికులు తెలిపారు. దీనిపై ఆర్టీసీ డ్రైవర్ మణికంఠతో మాట్లాడగా తన బస్సులోకి ప్యాసింజర్ ఎక్కిన వెంటనే వెనుక మరో బస్సు వచ్చి ఆగిందని, ఆ బస్సుకు చోటు ఇచ్చేందుకు బస్సును ముందుకు తీసుకెళ్లగా ఒక వ్యక్తి మద్యం తాగి లోనికి వచ్చి తనతో ఘర్షణ పడ్డాడని, ఈలోగా తన డోరు వద్దకు ఆరడుగుల ఎత్తున్న వైట్ అండ్ వైట్ బట్టలు ధరించి ఉన్న వ్యక్తి తన కుడి చేతిని మెలిపెట్టి ముఖంపై పిడి గుద్దులు గుద్దాడని తెలిపాడు. దీంతో పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా ఎక్స్‌రే తీసి తన చెయ్యి విరిగినట్టు ధ్రువీకరించారని తెలిపాడు. దీనిపై సమిశ్రగూడెం ఎస్ఐ ఎల్.బాలాజీ సుందరరావు ఆర్టీసీ డ్రైవర్ మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు.

వైసీపీ నాయకుడిని కాపాడేందుకు యత్నం?

డ్రైవర్‌పై దాడి చేసిన వైసీపీ నాయకుడిని కాపాడేందుకు కొందరు జనసేన నాయకులు రాజీ యత్నాల్లో బిజీబిజీగా ఉన్నట్టు సమాచారం. ఇలా అండగా నిలబడడం ఏమిటంటూ కూటమి నాయకులు గుసగుసలాడుతున్నారు.

ఆర్ట్స్ కళాశాలలో మోల్ దినోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం మోల్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. రసాయనశాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, త్రినాథ్ మాట్లాడుతూ మోల్ సంఖ్య ప్రాముఖ్యతను వివరించారు. అధ్యాపకులు సురేష్, సౌజన్య, సూర్యశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కామర్స్ ఫ్యాకల్టీకి బీఎఫ్ఎస్ఐ శిక్షణ.. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కామర్స్ విభాగ ఫ్యాకల్టీకి మూడు రోజులపాటు నిర్వహించే బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. కామర్స్ ఫ్యాకల్టీ నైపుణ్యాలు, జ్ఞానాన్ని మెరుగుపర్చడం, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ఈ కార్యక్రమం లక్ష్యం అని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో క్రిస్ప్ ప్రతినిధులు నగేష్‌బాబు, ప్రశాంత్, కామర్స్ విభాగాధిపతి వీవీవీ సత్యనారాయణ, ప్రోగ్రాం కన్వీనర్ రమేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చక్రద్వారబంధంలో ఘనంగా గణపతి హోమం



గణపతి హోమ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు

రాజానగరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప పడి పూజా కార్యక్రమంలో భాగంగా మండలంలోని చక్రద్వారబంధం గ్రామంలో అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో గణ పతి హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం అయ్యప్ప మాలధారులు గ్రామంలో పేటతుళ్లి చేపట్టారు. రాత్రికి అయ్యప్ప పూజను కన్నుల పండువగా నిర్వహించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

సీతానగరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగలపూడి గ్రామానికి చెందిన బాజింకి భద్రరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో ఆయన కుటుంబాన్ని టీడీపీ నాయకుడు పెందుర్తి అభిరామ్ గురువారం పరామర్శించారు.ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందించారు. అనంతరం సీతానగంలో అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటికి చేరిన మద్దా కొండలరావును పరామర్శించారు. కార్యక్రమంలో గద్దే సురేష్, నీరుకొండ వెంకటేశ్వరరావు, సిరికి గౌరిశంకర్, వాకలపూడి రామకృష్ణ, నీరుకొండ శ్రీనివాస్‌చౌదరి పాల్గొన్నారు.

మహిళా జూడో పోటీల్లో ఇద్దరికి గోల్డ్‌మెడల్స్



పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):మహిళా జూడో పోటీల్లో తమ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పోటీల్లో 52కిలోల విభాగం డి.శ్రీలక్ష్మి(బీఎస్సీ), 48 కిలోల విభాగంలో టి.లీలాలక్ష్మి(బీఎస్సీ) బంగారు పతకాలు సాధించారు. అలాగే 70 కిలోల విభాగంలో కె.జీవిత(బీఎస్సీ) వెండిపతకం, 78 కిలోల విభాగంలో ఎం.ధనలక్ష్మి(బీకాం) 44 కిలోల విభాగంలో కె.స్వర్ణలత(బీఎస్సీ) వెండి పతకాలు సాధించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఫిజికల్ డైరెక్టర్లు వై.సుధారాణి, ఎ.నాగు, ఆధ్యాపకులతో కలిసి ప్రిన్సిపాల్ అభినందించారు.

పలు కుటుంబాలకు మంత్రి దుర్గేష్ పరామర్శ

ఉండ్రాజవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ గురువారం పరామర్శించారు. చివటంలో పి.మణికంఠ కుటుంబ సభ్యులను, కె.సావరంలో కాకర్ల రవిచంద్ర, సీహెచ్ నారాయణమ్మ కుటుంబ సభ్యులను, పాలంగిలో కేతా కనకదుర్గ కుటుంబసభ్యులను, మోర్తలో కొప్పుల పూజిత, కొనకళ్ల శ్రీను కుటుంబసభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మరణించిన వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కొవ్వూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావాలని కొవ్వూరు డీఎస్పీ జీ. దేవకుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమర వీరుల త్యాగాలు మరువలేవన్నారు. కార్యక్ర మంలో పట్టణ సీఐ విశ్వం, దేవరపల్లి సీఐ నాగేశ్వర నాయక్, నల్లజర్ల సీఐ బాలశౌరి, పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్, రూరల్ ఎస్ఐ కె.శ్రీహరి, రూరల్ పీఎస్ఐ బి.జయరాజు, తాళ్లపూడి పీఎస్ఐ ఆదిత్య శ్రీనివాస్, సబ్ డివిజనల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: తుమ్మా
సూర్యమినీ	: ఓజీ
సూర్యప్యాలస్	: తెలుసు కదా
స్వామి	: తెలుసు కదా
అనుశ్రీ(సాయికృష్ణ)	: కె-ర్యాంప్
శివజ్యోతి	: డ్యూడ్
రాజా	: కె-ర్యాంప్
ఊర్వశి	: సలార్
మేనక	: తమ్మా
రంభ	: డ్యూడ్
అప్సర	: కాంతారా-1
అశోక	: డ్యూడ్
వీఎస్ మహల్(నామవరం)	: డ్యూడ్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: డ్యూడ్
వెంకటసూర్య(కడియం)	: డ్యూడ్
సత్యగౌరి (అనపర్తి)	: డ్యూడ్
సూర్యశ్రీ (అనపర్తి)	: తెలుసు కదా
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: డ్యూడ్
రామకృష్ణ(కోరుకొండ)	: కాంతారా-1
గీతాసినిమాస్ (సీతానగరం)	: కాంతారా-1
శ్రీనివాస (గోకవరం)	: కె-ర్యాంప్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: తెలుసు కదా
లలితామహల్(రంపచోడవరం)	: కె-ర్యాంప్
నవయుగ(చింతూరు)	: కె-ర్యాంప్



కామాంధుడి కథ ముగిసింది

- తునిలో బాలికపై అత్యాచారం చేసిన నిందితుడి మృతి
- పోలీసుల నుంచి తప్పించుకుని చెరువులో దూకిన నిందితుడు
- న్యాయాధికారి వద్దకు తరలిస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఘటన
- రాత్రి చెరువులో పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలించినా దొరకని ఆచూకీ
- గురువారం ఉదయం చెరువు మధ్యలో వలకు చిక్కిన మృతదేహం

(కాకినాడ/తునిరూరల్, ఆంధ్రజ్యోతి)

బాలికను చెరచిన కామాంధుడి కథ ముగిసింది.. తాతయ్యనంటూ బాలికపై పలుసార్లు అత్యాచారం చేసి అరెస్టయిన నిందితుడి కథ కంచికి చేరింది. చేసిన పాపానికి కటకటాల్లో శిక్ష అనుభవించాలన్న భయమో.. లేదంటే సభ్య సమాజానికి తన నిజరూపం బయట తెలిసిపోయిందన్న అవమానమో చివరకు నిందితుడు నారాయణరావు పోలీసులనుంచి తప్పించుకుని ప్రాణాలు కోల్పోయాడు. చెరువులోకి దూకి పాపం పండించుకున్నాడు. చివరికి ఈ కామాంధుడి మరణం సొంత రక్తసంబధీకులను సైతం కంటతడి పెట్టించలేదు. కనిపెంచిన తండ్రి పాపాలపుట్ట బద్దలై పైకి పోవడమే మంచిదయిందంటూ ఆగ్రహంగా పేర్కొనడం నిందితుడిపట్ల కుటుంబంలోను ఏస్థాయిలో ఏవగింపు కలిగించిందో చాటుతోంది. బాలికను చెరచిన ఇలాంటి వ్యక్తి చనిపోవడమే మంచిదంటూ ఆగ్రహం వ్యక్తం చేసేలా వారంతా వ్యాఖ్యానించడం నారాయణరావు చేసిన తప్పు ఎలాంటిదనేది చాటుతోంది. సదరు నిందితుడి మృతదేహాన్ని తీసుకోవడానికి కుటుంబీకులు సైతం ముందుకురాకపోవడం విశేషం. తొండంగి తోటలో బాలికను అత్యాచారం చేసిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టుచేయడంతోపాటు పలు తప్పుడు పోస్టులు షేర్ చేయడంపై వైసీపీ మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అనుచరుడు గణేశుల వీరబాబును పోలీసులు అరెస్ట్ చేశారు.



నారాయణరావు మృతదేహం

(మిగతా 8వ పేజీలో)

ఇంటి నుంచే పని.. చేసేయొచ్చు!



నిరుద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోం కింద ఉద్యోగాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నిరుద్యోగుల ఆశలను చిగురింపచేస్తూ వర్క్‌ఫ్రమ్ హోం కౌశలం సర్వేలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు త్వరలోనే ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఐటీ కంపెనీలు ఒక్కొక్కటిగా రాష్ట్రానికి తరలివస్తున్నాయి. ఈ తరుణంలో ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న వేలాదిమంది నిరుద్యోగులు చిరుద్యోగిగానైనా ఆయా మల్టీ నేషనల్ కంపెనీల్లో అవకాశం కల్పిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

- నిరుద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోంకు ఏర్పాట్లు
- త్వరలోనే ఆన్‌లైన్ పరీక్షలకు సన్నాహం
- సచివాలయాలకు వెబ్ కెమెరాలు, హెడ్‌సెట్‌లు పంపిణీ

అమలాపురం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా వేలసంఖ్యలో అభ్యర్థులు కౌశలం సర్వేలో దరఖాస్తు చేసుకున్నారు. నిరుద్యోగులకు సచివాలయాల వారీగా పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి పరీక్షల నిర్వహణలో భాగంగా సచివాలయాలకు వెబ్ కెమెరాలు, హెడ్‌సెట్‌లను పంపిణీ చేశారు. త్వరలోనే పరీక్షల నిర్వహణకు సంబంధించిన సమాచారం విడుదలయ్యే అవకాశం ఉంది. వర్క్‌ఫ్రమ్ హోం కింద కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ఏర్పాట్లు చేస్తుండడం పట్ల వారంతా ఆశగా ఎదురు చూస్తున్నారు.

రెండు విడతలుగా సర్వే

వర్క్‌ఫ్రమ్ హోం సర్వేలో భాగంగా తొలి విడత గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఇంటింటా సర్వే నిర్వహించారు. విద్యార్హతలను బట్టి వర్క్ ఫ్రమ్ హోం కింద ఏ తరహా ఉద్యోగాలు చేయాలనుకుంటున్నారో నమోదు చేశారు. పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్‌తోపాటు వివిధ విద్యార్హతలు ఉన్న అభ్యర్థుల సమాచారాన్ని సమగ్రంగా తొలివిడతలో సేకరించారు. తొలి విడతలో నిర్వహించిన వర్క్‌ఫ్రమ్ హోం సర్వే కింద ఉద్యోగాలు చేసేందుకు జిల్లాలో కొందరు నిరుద్యోగులు ఆమోదం తెలిపారు. వారి సమగ్ర సమాచారాన్ని ఈ ఏడాది ఆగస్టు నెలలో రెండోదశలో సేకరించారు. ఎవరెవరు ఏం చదువుకున్నారో తెలుసుకుని వారి సర్టిఫికెట్లను సైతం ఆన్‌లైన్ చేశారు. నిరుద్యోగ అభ్యర్థులకు తెలిసిన భాషలు ఎన్ని, విద్యార్హతలు, ఏమైనా స్పెషలైజేషన్ కోర్సు పూర్తి చేశారా, వచ్చిన మార్కులు, ఏ ఏడాదిలో ఉత్తీర్ణులయ్యారో తెలుసుకుని వివరాలు అన్నింటినీ సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ చేశారు.

సచివాలయశాఖ ఆధ్వర్యంలో పరీక్షలు

కౌశలం సర్వేలో వర్క్‌ఫ్రమ్ హోం కింద దరఖాస్తు చేసుకున్న వారికి జిల్లా గ్రామ, వార్డు సచివాలయశాఖ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే పరీక్షల నిర్వహణ వివరాలను వెల్లడించే అవకాశం ఉంది. ప్రభుత్వం పలు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని వారి సహకారంతో ఈ పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ఐటీ సెక్టార్‌పై దృష్టి సారించినట్టు తెలిసింది. ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు వర్క్‌ఫ్రమ్‌హోం కింద ఉద్యోగావకాశాలు మెండుగా కల్పించే అవకాశం ఉందంటున్నారు. దీనిలోభాగంగానే ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్నవారి ఇళ్ల వద్ద బ్రాడ్‌బ్యాండ్ కనెక్టవిటీ ఉందా, దాని స్పీడ్ వివరాలు, వర్క్ ఫ్రమ్ హోం ఉద్యోగం చేసుకోవడానికి ఇంట్లో ప్రత్యేక గది ఉందా, అదే గదిలో మరికొందరు పనిచేసుకునే అవకాశం ఉదా అన్న వివరాలను సైతం ఇప్పటికే సేకరించారు.

ఏ జిల్లాలో ఎందరు..

తొలి, రెండో దశల్లో మొత్తం సర్వే చేసిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 4,23,533 గృహాల్లో 9,34,989మంది చదువుకున్నవారు ఉన్నారు. వీరిలో 920791 మందిని సర్వేచేయగా 1,93,564మంది ఉద్యోగాల్లో ఉన్నారు. వీరిలో 14,865మంది వర్క్‌ఫ్రం హోంలో పనిచేస్తున్నట్టుగా గుర్తించారు.
- కాకినాడ జిల్లాలో 5,35,791 గృహాల్లో 11,79,587మంది చదువుకున్నవారు ఉన్నారు. వీరిలో 11,58,593మందిని సర్వే చేయగా 2,15,845మంది ఉద్యోగాల్లో ఉన్నారు. వీరిలో 19,628మంది వర్క్‌ఫ్రం హోంలో పనిచేస్తున్నట్టుగా గుర్తించారు.
- తూర్పుగోదావరి జిల్లాలో గృహాల్లో 463680మంది చదువుకున్నవారు ఉన్నారు. వీరిలో 10,19,051మందిని సర్వే చేయగా 10,01,395మంది ఉద్యోగాల్లో ఉన్నారు. వీరిలో 18,844మంది వర్క్‌ఫ్రం హోంలో పనిచేస్తున్నట్టుగా గుర్తించారు.

వానే..వాన!



- అల్పపీడనంతో జిల్లాలో వర్షాలు
- నేడు వాయుగుండంగా మారొచ్చు
- అత్యధికంగా బిక్కవోలులో 57.2.. అత్యల్పంగా గోకవరం 3.8. మి.మీ..వర్షపాతం
- మరో మూడురోజులు వర్షాలే
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం.. విద్యుత్‌శాఖ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు

వానే వాన.. జిల్లాలో గురువారం వర్షం జోరున కురిసింది. ఈ ధాటికి రహదారులు జలమయమయ్యాయి. కాగా, మరో రెండు, మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది.

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో గురువారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నగరంలో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షం పడుతూ ఉంది. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్డుపైకి వర్షపునీరు చేరి వాహనదారలు ఇబ్బందులు పడ్డారు. రైల్వేస్టేషన్ రోడ్డులో వర్షపునీరు వీధులల్లోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లివచ్చేటప్పుడు తడుస్తూ ఇబ్బందులు పడ్డారు. చిరువ్యాపారాలు చేసుకునేవారు, కూలీలదీ అదే పరిస్థితి.

జిల్లాలో 348.2 మి.మీ. వర్షపాతం

అల్పపీడనప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా గురువారం 348.2 మి.మీ. వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. జిల్లాలో అత్యధికంగా బిక్కవోలులో 57.2 మి.మీ. వర్షం కురిసింది. జిల్లాలో 19 మండలాల్లో 18.3శాతం వర్షం కురిసింది. అనపర్తిలో 34.6 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 26.6, రాజమహేంద్రవరంలో 24.8, రాజానగరంలో 20.4, నల్లజర్లలో 20.0, గోపాలపురంలో 19.2, రంగంపేటలో 18.8, తాళ్లపూడిలో 18.8, పెరవలిలో 17.4, కోరుకొండలో 16.4, ఉండ్రాజవరంలో 15.4, చాగల్లులో 13.4, కడియంలో 10.4, సీతానగరంలో 10.2, నిడదవోలులో 8.6, కొవ్వూరులో 6.4, దేవరపల్లిలో 5.8, గోకవరంలో 3.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

నాలుగైదురోజులపాటు

అల్పపీడనం శుక్రవారం మధ్యాహ్నం నాటికి బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఆ తర్వాత అది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ రాగల 24 గంటల్లో బలపడే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో జిల్లాలో మరో నాలుగైదు రోజులపాటు భారీవర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉంటుందని అమరావతి వాతావరణశాఖ వెల్లడించింది. తీరప్రాంతం అల్ల కల్లోలంగా మారింది. మధ్యాహ్నంనుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. గంటకు గరిష్ఠంగా 50కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండడంతో తీరప్రాంతాల్లో అలజడి నెలకొంది. ఈ నెల 25 వరకు కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాల్లోని అనేకచోట్ల ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు పడనున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా మారడంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసి వారిని అప్రమత్తం చేశారు.

సర్కిల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

- ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వాతావరణశాఖ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాజమహేంద్రవరంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ ఎండీ ఆదేశాల మేరకు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రాజమహేంద్రవరంలోని జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో 7382299960, 0883-2463354 నెంబర్లు, రాజమహేంద్రవరం టౌన్ కార్యాలయంలో 9490610093, రూరల్ డివిజన్‌లో 9593178874, నిడదవోలు డివిజన్‌లో 8332973595 నెంబర్లతో 24 గంటలపాటు మూడు షిఫ్టుల్లో పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. భారీవర్షం, వరదల వల్ల ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడితే దగ్గరలోని విద్యుత్ సెక్షన్ ఆఫీసుకుగానీ, టోల్‌ఫ్రీ నెంబరు 1912 కుగానీ, కంట్రోల్ రూమ్ నెంబర్లకుగానీ సమాచారం అందించాలని ఎస్ఈ కోరారు.

పారిశ్రామికవాడల్లో పచ్చదనం -పరిశుభ్రత

- ధవళేశ్వరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో మొక్కలు నాటిన కలెక్టర్ కీర్తి

రాజమహేంద్రవరంరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ధవళేశ్వరం ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో గురువారం పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. దీనికి కలెక్టర్ కీర్తి చేకూరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. విశాఖలో ఈనెల 14,15 తేదీల్లో జరిగిన పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో భాగంగా ఈనెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మొదటివారంలో పరిశుభ్రత, రెండోవారంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. దీనికి కొనసాగింపుగా నిర్వహించిన పచ్చదనం-పరిశుభ్రతలో కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడారు. పారిశ్రామికవేత్తలు తమ యూనిట్ల పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచుకోవాలని సూచించారు. పరిశుభ్రతతో ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు ఆరోగ్యంగా, ఉత్సాహంగా పనిచేయగలరని అన్నారు. ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ మాట్లాడుతూ పారిశ్రామికవాడల్లో ఉన్న యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతూ పర్యావరణానికి అనుకూలంగా వ్యవహరించాలన్నారు. పరిశ్రమలు పచ్చదనం-పరిశుభ్రతను సమన్వయంగా కొనసాగిస్తే వాటి అభివృద్ధి సుస్థిరంగా ఉండడమే కాకుండా స్థానిక ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయన్నారు. కడియం ప్రాంతంలో ఉన్న చిన్నచిన్న నర్సరీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, పర్యాటకఅభివృద్ధి దృష్ట్యా కడియపులంక-పొట్టిలంక మధ్యలో స్టాల్స్ ఏర్పాటు చేయాలనే గత కలెక్టర్ నిర్ణయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ధవళేశ్వరం ఇండస్ట్రీయల్ ఎస్టేట్ కమిటీ అధ్యక్షుడు మార్ని వాసుదేవ్, జీఎం ఎ.రమణారెడ్డి, డిప్యూటీ జోనల్ మేనేజరు బి.రాధమణి, జీఎం డీఐసీ రామమ్, వ్యవసాయ అధికారి మాధవరావు, పారిశ్రామికవేత్తలు శ్యామ్‌సుందర్, భాస్కరరావు, ప్రభాకర్, సూర్యప్రకాష్, శ్రీహరి పాల్గొన్నారు.

వైసీపీలోనే కల్తీ మద్యానికి మూలాలు

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కల్తీమద్యం మూలాలు వైసీపీలోనే ఉన్నాయని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా వైసీపీ ఉందని ధ్వజమెత్తారు. ఐదేళ్లపాటు అరాచకపాలన చేసిన వైసీపీ రాష్ట్రంలో కల్తీమద్యాన్ని పెంచి పోషించిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కల్తీ మద్యంపై ఉక్కుపాదం మోపడంతో వాస్తవాలు బయటకు వచ్చి వైసీపీనేత జోగిరమేష్ అడ్డంగా దొరికిపోయాడన్నారు. జగన్ జమానాలో నాసిరకం మద్యం అమ్మకాలతో రాష్ట్రంలో ఎంతమందికి లివర్లు దెబ్బతిన్నాయో ఆసుపత్రి రికార్డులను పరిశీలిస్తే అర్థమవుతుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక కల్తీ మద్యం వ్యవహారంపై స్పెషల్ టాస్క్‌ఫోర్స్ వేయడంతో వైసీపీ గుండెల్లో దడ మొదలైందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జనసేనసిటీ ఇన్చార్జి అనుశ్రీ సత్యనారాయణ, నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్, అడబాల రామకృష్ణారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

ఆరోగ్యశ్రీ బకాయిలకు వైసీపీ విధానాలే కారణం: ఎమ్మెల్యే నల్లమిల్లి




రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకపోవడానికి వైసీపీ ప్రభుత్వ విధానాలే కారణమని అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ బకాయిలేకాదు రైతుల బకాయిలు, కాంట్రాక్టర్ల బకాయిలకు కూడా వైసీపీ ప్రభుత్వమే కారణమని విమర్శించారు. సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిసి మాట్లాడతారో తెలియక మాట్లాడతారో అర్థం కాదన్నారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు అనపర్తిలో హాల్టు ఇవ్వడంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందన్నారు. ఎంపీ పురందేశ్వరి కృషితో ఇది సాధ్యమైందని, ఆమెకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాయవరం బాణసంచా పేలుడు ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.15లక్షల చొప్పున పరిహారం ప్రకటించిందన్నారు. కార్మికశాఖ మంత్రి సుభాష్ సమక్షంలో శుక్రవారం పరిహారం అందజేస్తామని ఆయన వెల్లడించారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి పూర్వవైభవం

- జనవరి నాటికి పూర్తిస్థాయి కార్యకలాపాలు
- త్వరలో రిజిస్ట్రార్, ఇతర ప్రధాన విభాగాల అధికారుల నియామకం
- తొలి వీసీగా బాధ్యతలు స్వీకరించిన మునిరత్నంనాయుడు

రాజమహేంద్రవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): 'తెలుగు విశ్వవిద్యాలయానికి పూర్వవైభవం తెస్తాం. ఎన్టీఆర్ ఆశయానికి పునరంకితమవుతాం. జనవరినాటికి పూర్తిస్థాయి విశ్వవిద్యాలయ కార్యకలాపాలు ప్రారంభిస్తాం' అని వైస్ చాన్సలర్ ఆచార్య డి.మునిరత్నంనాయుడు స్పష్టం చేశారు. స్థానిక బొమ్మూరులోని తెలుగు విశ్వవిద్యాలయంలో గురువారం ఆయన తొలి వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి తెలుగు విశ్వవిద్యాలయంలో పలు పదవులు నిర్వహించి, నెల్లూరు కేంద్రంగా ఉన్న ప్రాచీన తెలుగు భాషా అధ్యయన కేంద్రం మాజీ ప్రాజెక్టు డైరెక్టర్ మునిరత్నం నాయుడికి అనుభవం ఉంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా కొత్తకోర్సులు ప్రవేశపెట్టనున్నట్టు చెప్పారు.ఈ విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ మానసపుత్రిక అనీ, ఆయన కలల్లో తెలుగు తల్లి గౌరవాన్ని పెంచే ఆవిష్కరణ ఒకటని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సమానాభివృద్ధి దృష్ట్యా రాజమహేంద్రవరం, శ్రీశైలం, వరంగల్ హైదరాబాద్‌లలో విభిన్న పీఠాలు ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన వివరించారు. అప్పటి మొదటి ఉపకులపతి ఆచార్య దోణప్ప శయంతి ఉత్సవాలను ఈ ఏడాది నిర్వహించనున్నట్టు తెలిపారు. నవోదయ పాఠశాలలు, సీబీఎస్ఈ పాఠశాలలో మూడో భాషగా తెలుగు బోధన ప్రవేశపెట్టనున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ఎన్టీఆర్ స్వయంగా వచ్చి ఇక్కడ తెలుగుపీఠం ప్రారంభించారని, మాతృభాషలో విద్యా బోధన చేయాలనే దృఢ సంకల్పమే ఆయన ఆశయమన్నారు. త్వరలో లైబ్రరీ అభివృద్ధి, ప్రాంగణంలో మౌలిక సదుపాయాల కల్పన, రహదారి అనుసంధానం, భవన మరమ్మతులు, పెయింటింగ్, వంటి పనులకు చర్యలు చేపడతామని వివరించారు. కార్యక్రమంలో శ్రీశైలం ప్రాంగణం పీఠాధిపతి ముసుగు శ్రీనివాసరావు, పారిస్ తెలుగు పరిశోధకుడు డేనియల్ నెజర్స్, ఓఎస్డీ వి.నిరీక్షణబాబు, కవి బిక్కి కృష్ణ, కూడిపూడి గురువు దుర్గాప్రసాద్, కూచిపూడి ప్రిన్సిపాల్ ఇంతా రవి బాలకృష్ణ, మురళి రత్నాల పాల్గొన్నారు.



వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న మునిరత్నంనాయుడు.. చిత్రంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గౌరీపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గౌరీపట్నం, దుద్దుకూరులో ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 3.30 నిమిషాల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు నిడదవోలు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

బీటీ రోడ్డు తనిఖీ


రోడ్డును తనిఖీ చేస్తున్న పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు, సిబ్బంది

గోపాలపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కరిచర్లగూడెంలో నాబార్డు నిధులు రూ. కోటి 50 లక్షలతో 2.9 కిలోమీటర్ల మేర నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కరిచర్లగూడెం నుంచి జాతీయ రహదారిని ఆనుకుని సంజీవపురం రహదారి పనులు శరవేగంగా పూర్తిచేయడం జరిగిందన్నారు. రహదారి నిర్మాణ పనుల్లో ఎక్కడా రాజీపడలేదన్నారు. ఆయన వెంట జేఈ విజయలక్ష్మి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

గోష్పాద క్షేత్రంలో వేద శాస్త్ర సభ


వేద శాస్త్ర సభలో మాట్లాడుతున్న వేద పండితులు

కొవ్వూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోష్పాద క్షేత్రంలో గోష్పాదక్షేత్ర వేద శాస్త్రాభివర్ధక పరిషత్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో గురువారం వేదశాస్త్ర సభను నిర్వహించారు. దోర్బల ప్రభాకర శర్మ, నోరి భోగేశ్వర శర్మ, గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనాపాటి, దువ్వూరు పాపకాశశైనులు, తంగిరాల సుబ్రహ్మణ్యం, ధూళిపాల రామచంద్ర సూర్యనారాయణ శాస్త్రి, అనుపిండి చక్రధరరావు, గుళ్లపల్లి చిన్న ఆంజనేయ ఘనాపాటి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

తాళ్లపూడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తాడిపూడి విశాల పరపతి సంఘం (సొసైటీ) అధ్యక్షుడు నామా కొండబాబు ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. దీన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, టీడీపీ నాయకులు సిద్ధా దర్గారావు, సొసైటీ కార్యదర్శి బొర్రా రామచంద్రం, యువగళం నాయకులు కూచిపూడి గణపతి, అన్నమరెడ్డి రమణ, నామా సూర్యప్రకాష్, తహసీల్దార్ లక్ష్మీలావణ్య, ఏవో రుచిత, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాల రేవులో కార్తీక నందాదీపం


కార్తీక నందా దీపం వద్ద ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

తాళ్లపూడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి పుష్కరాల రేవులో గోదావరి నదీ తీరం వద్ద కార్తీకమాసం సందర్భంగా నిత్యం వెలిగేలా కార్తీక నందా దీపాన్ని ఏర్పాటు చేశారు. గౌతమేశ్వరస్వామి, సత్యనారాయణ స్వామి ఆలయాల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, గణపతి యువజన సంఘం సభ్యుల సహకారంతో గోదారమ్మ వద్ద నిత్యం వెలిగేలా అద్దాల పెట్టెలో దీపాన్ని ఏర్పాటు చేశారు. వెలుగుల అన్నవరం, డీవీవీ సత్యనారాయణ, కిల్లాని అప్పారావు, సింగం శివరామకృష్ణ, నందమూరి రాజు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కత్తి పడి ఒకరి మృతి

నల్లజర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కత్తి జారి తలపై పడిన ఘటనలో కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన దూబచర్లలో గురువారం చోటుచేసుకుంది. నల్లజర్ల పోలీసుల వివరాలివి... జగన్నాథపురం గ్రామానికి చెందిన పేర్ల నాగేశ్వరరావు (35) కొంతమందితో కలిసి దూబచర్లలోని ఆయిల్‌పాం గెలలు కోసేందుకు ఉదయం వెళ్లాడు. కాగా నాగేశ్వరరావు కత్తితో గెలలు కోస్తున్న సమయంలో ఇనుప గెడకు ఉన్న కత్తి పై నుంచి జారి తలపై పడడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

క్యూఆర్ కోడ్ ద్వారా నకిలీ మద్యాన్ని తెలుసుకోండి

• ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు • తాళ్లపూడిలో మద్యం దుకాణం తనిఖీ

తాళ్లపూడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం నకిలీదా కాదా అన్నది క్యూఆర్ కోడ్ ద్వారా సులభంగా తెలుసుకోవచ్చని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన తాళ్లపూడి విచ్చేసిన సందర్భంగా మద్యం దుకాణాన్ని అకస్మాత్తుగా పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పక్షం తీరు చూస్తుంటే దొంగలే దొంగ, దొంగ అన్నట్టుందన్నారు. నకిలీ మద్యం కేసుల్లో గత పాలకులే ఉన్నారని, ఎన్డీయే ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో పనిచేస్తోందన్నారు. నాణ్యమైన మద్యం కోసం వినియోగదారులు సైతం క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


తాళ్లపూడిలో మద్యం సీసాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

ఆర్టీసీ డ్రైవర్‌పై వైసీపీ నాయకుడి దాడి

• విరిగిపోయిన చెయ్యి... కేసు నమోదు • రాజీ చేసేందుకు జనసేన నాయకుల యత్నం?

నిడదవోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్‌పై వైసీపీ నాయకుడు దాడికి పాల్పడ్డాడు. దీంతో డ్రైవర్ చెయ్యి విరిగిపోయిన సంఘటన గురువారం డీ. ముప్పవరంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజమండ్రి వెళుతూ డి.ముప్పవరం సెంటర్ వద్దకు చేరుకుంది. దీంతో అక్కడ ఉన్న ఒక ప్యాసింజర్‌ను ఎక్కించుకుని కొంచెం ముందుకు కదిలేసరికి అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడి సోదరుడు బస్సు ఎక్కాడు. అప్పటికే మద్యం సేవించి ఉన్నాడు. కాగా, బస్సు పక్కనే ఉన్న సదరు వ్యక్తి సోదరుడు, వైసీపీ నాయకుడు ఎందుకు బస్సు ఆయన ఆపమన్న చోట ఆపలేదని డ్రైవర్‌తో గొడవపడి కుడి చేతిని బయటకు లాగుతూ ముఖంపై దాడి చేసినట్టు బస్సులోని ప్రయాణికులు తెలిపారు. దీనిపై ఆర్టీసీ డ్రైవర్ మణికంఠతో మాట్లాడగా తన బస్సులోకి ప్యాసింజర్ ఎక్కిన వెంటనే వెనుక మరో బస్సు వచ్చి ఆగిందని, ఆ బస్సుకు చోటు ఇచ్చేందుకు బస్సును ముందుకు తీసుకెళ్లగా ఒక వ్యక్తి మద్యం సేవించి లోనికి వచ్చి తనతో ఘర్షణ పడ్డాడని, ఈలోగా తన డోరు వద్దకు ఆరు అడుగులు ఎత్తు ఉన్న వైట్ అండ్ వైట్ బట్టలు ధరించి ఉన్న వ్యక్తి తన కుడి చేతిని మెలిపెట్టి ముఖంపై పిడి గుద్దులు గుద్దాడని తెలిపాడు. దీంతో పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా ఎక్స్‌రే తీసి తన చెయ్యి విరిగినట్టు ధృవీకరించారని తెలిపాడు. దీనిపై సమిశ్రగూడెం ఎస్ఐ ఎల్.బాలాజీ సుందరరావు ఆర్టీసీ డ్రైవర్ మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు.


విరిగిపోయిన చెయ్యితో ఆర్టీసీ డ్రైవర్ మణికంఠ

• రాజీ చేసేందుకు జనసేన నేతల యత్నం?

డ్రైవర్‌పై దాడి చేసిన వైసీపీ నాయకుడిని కాపాడేందుకు కొందరు జనసేన నాయకులు రాజీ యత్నాల్లో బిజీబిజీగా ఉన్నట్టు సమాచారం. ఇలా అండగా నిలబడడం ఏమి టంటూ కూటమి నాయకులు గుసగుసలాడుతున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జయశ్రీ ఎంపిక

దేవరపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని మంచిలి జయశ్రీకి రూ.12 వేలు నగదును టీడీపీ నాయకులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం పేరం రవీంద్రనాథ్ మాట్లాడుతూ జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు జయశ్రీ ఎంపికయ్యిందని, కాగా ఈ పోటీలు వచ్చేనెల 25వ తేదీ నుంచి 27 వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరుగుతాయన్నారు. దీంతో ఆ క్రీడాకారిణికి రవాణా ఖర్చుల నిమిత్తం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పరిమి శ్రీరామకృష్ణ రూ.5 వేలు, కాట్రగడ్డ రామ్మోహనరావు రూ.7 వేలు అందజేశారు. కార్యక్రమంలో పీఈటీ సరస్వతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కాట్రగడ్డ రామ్మోహనరావు, పరిమి శ్రీరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థికి రూ.12 వేలు ఆర్థిక సహాయం అందజేసిన టీడీపీ నాయకులు

పలు కుటుంబాలకు మంత్రి దుర్గేష్ పరామర్శ

ఉండ్రాజవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ గురువారం పరామర్శించారు. చివటంలో పి. మణికంఠ కుటుంబసభ్యులను, కే. సావరంలో కాకర్ల రవిచంద్ర, సీహెచ్ నారాయణమ్మ కుటుంబసభ్యులను, పాలంగిలో కేతా కనకదుర్గ కుటుంబసభ్యులను, మోర్తలో కొప్పుల పూజిత, కొనకళ్ల శ్రీను కుటుంబసభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మరణించిన వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, ఆయాగ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


కే. సావరంలో రవిచంద్ర కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి దుర్గేష్, పక్కన ఇతరులు

స్వచ్ఛంద రక్తదాన శిబిరం


శిబిరంలో మాట్లాడుతున్న డీఎస్పీ దేవకుమార్, తదితరులు

కొవ్వూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావాలని కొవ్వూరు డీఎస్పీ జీ. దేవకుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమర వీరుల త్యాగాలు మరువలేవన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ విశ్వం, దేవరపల్లి సీఐ నాగేశ్వర నాయక్, నల్లజర్ల సీఐ బాలశౌరి, పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్, రూరల్ ఎస్ఐ కే. శ్రీహరి, రూరల్ పీఎస్ఐ బీ. జయరాజు, తాళ్లపూడి పీఎస్ఐ ఆదిత్య శ్రీనివాస్, సబ్ డివిజనల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డు సమస్య పరిష్కారం

నల్లజర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెంలో బ్రిటిష్ కాలం నాటి తూరలను తొలగించి రోడ్డు వేసేందుకు గత వైసీపీ నాయకులు ప్రయత్నించగా, కూటమి నాయకులు వ్యతిరేకించి తూరలు ఏర్పాటు చేయాలని ప్రతిఘటించారు. అయినా రోడ్డు వేసేందుకు ప్రయత్నించగా హైకోర్టును కూటమి నాయకులు ఆశ్రయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వాదనలు విన్న కోర్టు కూటమి నాయకులకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో గురువారం గ్రామంలో తూరలు ఏర్పాటు చేసి సీసీ రోడ్డును నిర్మించారు. సమస్యలను చూసి పారిపోకుండా ఎదు రొడ్డి నిలబడినప్పుడే పరిష్కారం దొరుకు తుందని కూటమి నాయకులు పేర్కొంటున్నారు. సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, పసుమర్తి రతీష్, నల్లజర్ల సొసైటీ చైర్మన్ రావూరి వెంకట రమణ ఎంతో కృషి చేసినట్టు కూటమి నాయకులు పేర్కొన్నారు.


చీపురుగూడెంలో సీసీ రోడ్డు వేసిన దృశ్యం

సాయిబాబా ఆలయంలో కార్తీక దీపార్చన


దేవరపల్లిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

దేవరపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో 108 కార్తీక దీపాలను భక్తులు వెలిగించారు. ఆలయ ప్రధానార్చకుడు అగ్నిహోత్రం సత్య నారాయణ ఆచార్యులు మాట్లాడుతూ కార్తీకం నెల రోజులు ప్రతిరోజూ భక్తులు, దంపతులచే 108 కార్తీక దీపాలను వెలిగించటం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో గుడ్ల వెంకటేశ్వరరావు, కనకదుర్గ దంపతులు పాల్గొన్నారు.

కామాంధుడి కథ ముగిసింది

(5వ పేజీ తరువాయి)

తుని రూరల్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికను అత్యాచారం చేసిన నిందితుడు నారాయణరావు (62)ను పోలీసులు బుధవారం సాయంత్రం అరెస్టు చేయగా, అతడి తక్షణం అరెస్ట్‌తో తగిన శాస్తి జరిగిందని అంతా అనుకున్నారు. పోలీసులు సైతం తమకు పక్కా ఆధారాలతో వీడియో దొరకడం, బాధితురాలిచ్చిన వివరాలు, వైద్య పరీక్షల నివేదిక ఆధారంగా నిందితుడు అత్యాచారం చేసినట్లు నిర్ధారణ అవడంతో రిమాండ్‌కు తరలించడానికి ఏర్పాట్లు చేశారు. తుని మేజిస్ట్రేట్ ముందు నిందితుడిని హాజరుపర్చడానికి పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం వీడియో సాక్ష్యం, ఎఫ్ఐఆర్, ప్రాథమిక ఆధారాలు సిద్ధం చేశారు. కానీ తుని మేజిస్ట్రేట్ అందుబాటులో లేకపోవడంతో ప్రత్తిపాడు మేజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చేందుకు బయలుదేరారు.

బహిర్భూమికి వెళ్లాలని జీపు ఆపి..

రాత్రి పది గంటలకు తునిరూరల్ పోలీసులు నిందితుడిని జీపులో ఎక్కించి ప్రత్తిపాడు మేజిస్ట్రేట్ వద్దకు బయలుదేరారు. కాగా, తాను బహిర్భూమికి వెళ్లాలని జీపు ఆపాలని నిందితుడు కోరాడు. ప్రత్తిపాడులో వెళ్లవచ్చని పోలీసులు చెప్పినా వెంటనే ఆపాలంటూ ఒత్తిడి తెచ్చాడు. దీంతో తుని పట్టణ శివారులోని కోమటి చెరువు వద్ద పోలీసులు జీపు ఆపారు. అదే సమయంలో వర్షం పడుతుండడంతో పక్కనే ఉన్న చెట్టు కిందకు ఎస్కార్ట్ సిబ్బంది వెళ్లి నిలబడ్డారు. ఈలోపు నిందితుడు పక్కనే ఉన్న చెరువులోకి దూకేశాడు. ఒక్కసారిగా శబ్దం విన్న పోలీసులు చెరువులోకి దిగి గాలించే ప్రయత్నం చేశారు. కానీ జాడ కనిపించలేదు. వెంటనే ఫైర్‌సిబ్బందికి ఫోన్ చేయగా వారు కూడా చాలాసేపు వెతికారు. అయినా జాడ కనిపించలేదు. దీంతో ఉదయాన్నే గజ ఈతగాళ్లను పిలిపించి చెరువులో గాలించారు. వలలు వేసి వెతికారు. చెరువు మధ్యలో కరెంట్ స్తంభం సమీపంలో నిందితుడి మృతదేహం వలకు చిక్కింది. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు మృతుడు నారాయణరావుగా నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మరోపక్క నిందితుడు బుధవారం రాత్రి జైలుకి వెళ్లి ఉంటాడని అనుకున్న వారందరికీ గురువారం ఉదయం మృతి వార్త తెలియడంతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

రోజంతా పోలీసుల బందోబస్తు..

అత్యాచార నిందితుడు నారాయణరావు మృతి చెందడం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గురువారం సంచలనమైంది. నిందితుడు తప్పించుకుని పారిపోయే క్రమంలో చనిపోవడంతో పీడవిరగడైందని చర్చోపచర్చలు జరిగాయి. మరోపక్క నారాయణరావు మృతి సమాచారం తెలియడంతో అతడి కొడుకు, కోడలు, కూతురు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వారెవరూ కనీసం విచారం వ్యక్తం చేయకపోవడం విశేషం. నారాయణరావు చేసిన పాపానికి చనిపోవడమే కరెక్ట్ అంటూ కుటుంబీకులు సైతం అసహ్యించుకున్నారు. నిందితుడికి బుధవారం రాత్రి బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు దేహశుద్ధి చేసినప్పుడే తమకు అతడు చేసిన తప్పు అర్థమై దూరంగా ఉన్నామని వివరించారు. స్టేషన్‌కు పోలీసులు తీసుకువెళ్లినప్పుడు కూడా వదిలేశామన్నారు. అయితే నిందితుడు రాత్రి చనిపోయిన విషయాన్ని దాచేసి కోర్టుకు తీసుకువెళ్లడం కోసం తమవద్ద పోలీసులు సంతకం తీసుకున్నారని కొడుకు, కోడలు వాపోయారు. నిందితుడు చనిపోయాడని రాత్రే నిజం చెబితే తామే సంతకం పెట్టేవాళ్లమని వివరిం చారు. నిందితుడు చెరువులో దూకిన ప్రాంతం వద్ద పోలీసులు రోజంతా బందోబస్తు నిర్వహించారు. అక్కడ ఎలాంటి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా నిఘా ఉంచారు. నారాయణరావు మృతదేహాన్ని పోలీసులు తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. శవపంచనామా కోసం కుటుంబీకుల్లో ఒకరు సంతకం చేయాలని పోలీసులు కోరినా ఎవరూ ముందుకు రాలేదు. నారాయణకు ఇద్దరు భార్యలున్నారు. వీరిద్దరికీ సమాచారం ఇచ్చినా మధ్యాహ్నం వరకు ఎవరూ మృతదేహం కోసం ముందుకు రాలేదు. దీంతో సాయంత్రం శవపంచనామా పూర్తయింది.

వైరల్ వీడియోపై పోలీసులు రంగంలోకి..

తొండంగి తోటలో నిందితుడు నారాయణరావు మైనర్ బాలికను అత్యాచారం చేసిన వీడియోలు బుధవారం నుంచీ వైరల్ అవుతున్నాయి. ఈ వీడియోలో బాలిక వీడియోలు స్పష్టంగా కనిపిస్తుండడాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణించారు. బాలికలు కనిపించేలా ఇలా వీడియోలు పోస్ట్ చేసిన వారిపై పోలీసులు గురువారం దర్యాప్తు ప్రారంభించారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు వీడియోలు తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని, కానీ ఇలా సోషల్ మీడియాలో వైరల్ చేయడం వల్ల బాలిక భవిష్యత్తుకు ఇబ్బందులు వస్తాయని పోలీసులు హెచ్చరించారు. గురువారం సాయంత్రంలోగా వీటిని సోషల్ మీడియా నుంచి తొలగించాలని బాధ్యులను హెచ్చరించారు. లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానీ చాలామంది నుంచి స్పందన లేదు. ఈ నేపథ్యంలో వీటిని పరిశీలించిన పోలీసులు గురువారం సాయంత్రం వైసీపీ మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్య అనుచరుడు గణేశుల వీరబాబు (35)పై కేసు నమోదు చేశారు. అత్యాచార వీడియోలు, నిందితుడి తనయుడు హోంమంత్రి అనిత అనుచరుడిగాను, నిందితుడు మాజీమంత్రి యనమలతోను ఉన్నట్టు మార్ఫింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేయడాన్ని గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు.

మృతదేహం వద్ద కుటుంబీకుల రోదన


తండ్రి మృతదేహం వద్ద విలపిస్తున్న కుమార్తె

తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసులు కళ్లు గప్పి తప్పించుకునే ప్రయత్నంలో కామాంధుడు నారాయణరావు చెరువులో మునిగి బుధవారం రాత్రి మృతిచెందాడు. కాగా, రాత్రి కురిసిన వర్షం కారణంగా బయటకు తీసేందుకు వీలు లేకపోవడంతో గురువారం వేకువజాము నుంచే నారాయణరావు మృతదేహం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని వెలికితీయడంతో కొడుకు సురేష్, కూతురు నాగలక్ష్మి, కోడలు రాజేశ్వరి మృతదేహం వద్దకు వచ్చారు. అక్కడ ఆందోళన వ్యక్తం చేసిన కొడుకు సురేష్, కోడలు రాజేశ్వరి, తమ తండ్రి చేసిన పనికి శిక్ష పడాల్సిందేనని కానీ చెరువులో పడి చనిపోవడంపై అనుమానాలు ఉన్నాయన్నారు. అనంతరం మృతదేహాన్ని పోలీసులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉంటే అత్యాచారానికి గురైన బాలిక తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

గురుకులంలో అధికారుల విచారణ

తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల విద్యార్థినిపై వృద్ధుడు తాటిక నారాయణరావు అత్యాచారానికి ఒడిగట్టడం సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. దీంతో గురుకుల పాఠశాల ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. స్టేట్ సెక్రటరీ మస్తానయ్య, జాయింట్ సెక్రటరీ అబుల్‌దుల్లా, ఇరువురు పాఠశాల ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులతో సమావేశమై బాలిక బయటకు వెళ్లడానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నారాయణరావు అనే వ్యక్తి బాలిక తాతయ్యగా చెప్పుకుని పలుమార్లు పాఠశాలకు తినుబండారాలు తీసుకురావడంతో పాటు రెండు సార్లు బాలికను బయటకు తీసుకెళ్లాడన్నారు. తాతయ్యగా నమ్మిన సిబ్బంది బయటకు పంపించడం జరిగిందని, విద్యార్థిని కూడా తమ తాతయ్య అని ధ్రువీకరించిందన్నారు.


పాఠశాలలో విచారణ చేపడుతున్న దృశ్యం

కరిచర్లగూడెం మాతంగమ్మ ఆలయంలో చోరీ


సీసీ ఫుటేజీలో చోరీకి యత్నిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి

గోపాలపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కరిచర్లగూడెం గ్రామ శివారులో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మాతంగమ్మ ఆలయంలో చోరీకి పాల్పడినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ శివారులో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఆలయంలో బుధవారం రాత్రి ఆలయంలో చొరబడి ఉన్న డబ్బీని పగలగొట్టి అందులో ఉన్న సొమ్మును అపహరించుకుపోయినట్టు తెలిపారు. ఇటీవలే ఆలయం వద్ద దసరా ఉత్సవాలు నిర్వహించామని, దీంతో రూ. 10 నుంచి 15000 వేల వరకు హుండీలో అమ్మవారి కానుకలు ఉన్నాయన్నారు. గోపాలపురంలోని కనకదుర్గమ్మ వారి ఆలయంలో కూడా బుధవారం రాత్రి చోరీ జరిగినట్టు విశ్వసనీయ సమాచారం.

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

• పందలపాక ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల

బిక్కవోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు బహూకరించిన ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయిలో ఉపకార వేతనాలు పొందాలని పందలపాక ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల సత్తిరాజు సూచించారు. గురువారం ఆయన ఈ మెటీరియల్‌ను ఈ పరీక్షలు రాసే 30మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు వీర్రెడ్డి, శ్రీనివాసరావు, నాగబాబు, వీరభద్రం, అంజనీకుమార్, తదితరులు పాల్గొన్నారు.

అండర్-17 బాలికల వాలీబాల్ జట్టు

అనపర్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అనపర్తి జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14, 17 జట్ల ఎంపికలో భాగంగా గురువారం బాలికల అండర్-17 వాలీబాల్ జట్టు ఎంపిక జరిగింది. ఈ ఎంపికల్లో రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 200 మంది క్రీడాకారులు, 60 మంది వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే అండర్-17 బాలుర జట్టుకు ఎంపికకు వర్షం అడ్డంకి రావడంతో ఎంపికలను వాయిదా వేసినట్టు డివిజనల్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాకినాడ స్కూల్ గేమ్స్ సెక్రటరీ తదుపరి తేదీని ప్రకటిస్తారని ఆయన తెలిపారు.

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా మోల్ దినోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం మోల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. రసాయనశాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, త్రినాథ్ మాట్లాడుతూ మోల్ సంఖ్య ప్రాముఖ్యతను వివరించారు. అధ్యాపకులు సురేష్, సౌజన్య, సూర్యశ్రీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ ఫ్యాకల్టీకి బీఎఫ్ఎస్ఐ శిక్షణ..

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కామర్స్ విభాగ ఫ్యాకల్టీకి మూడు రోజులపాటు నిర్వహించే బ్యాంకింగ్, ఫైనాన్సియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. కామర్స్ ఫ్యాకల్టీ నైపుణ్యాలు, జ్ఞానాన్ని మెరుగుపర్చడం, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ఈ కార్యక్రమం లక్ష్యం అని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో క్రిస్ప్ ప్రతినిధులు నగేష్‌బాబు, ప్రశాంత్, కామర్స్ విభాగాధిపతి పీవీవీ సత్యనారాయణ, ప్రోగ్రాం కన్వీనర్ రమేష్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.